ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

3




విశాఖపట్నం

జిల్లా వార్తలు

మంగళవారం 7 అక్టోబరు 2025

జీవీఎంసీకి స్వచ్ఛ అవార్డు

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ 'స్వచ్ఛ' అవార్డు అందుకున్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడుతూ నగర ప్రజలు, నివాసిత సంక్షేమ సంఘాలు, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికుల భాగస్వామ్యంతో ఈ అవార్డు దక్కిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆశయ సాధన దిశగా ప్రారంభమైన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను ముందుకు తీసుకువెళతామని కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. స్వచ్ఛ మునిసిపాలిటీల కేటగిరీలో జీవీఎంసీ (స్వచ్ఛ సర్వేక్షణ్ స్పెషల్)కి రాష్ట్రస్థాయి అవార్డు లభించిన విషయం తెలిసిందే.



విజయవాడలో సోమవారం సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

పోర్టు ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు

- కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్
- మరో రూ.168 కోట్ల ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టులో ఉద్యోగులు, పెన్షనర్లకు ఉపయోగపడే విధంగా డిజిటల్ హెల్త్ కార్డు ప్రాజెక్టును యాజమాన్యం ప్రారంభించనుందని కేంద్ర పోర్టులు, నౌకాయాన, జల రవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రకటించారు. అక్కయ్యపాలెంలోని సాగరమాల కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రూ.168 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, కోటి రూపాయల వ్యయంతో చేపట్టిన డిజిటల్ హెల్త్ కార్డు ప్రాజెక్టు మూడు నెలల్లో పూర్తవుతుందన్నారు. ఆ తరువాత క్యుఆర్/ఆధార్ లింక్డ్ హెల్త్ కార్డులు అందిస్తారని, దాంతో వైద్య సేవల ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. పోర్టులో ఈస్ట్ క్వే-1 టెర్మినల్‌ను ఆపరేషన్, నిర్వహణ కోసం గ్రీన్ ఎనర్జీ రిసోర్సెస్‌కు అప్పగించినట్టు (రూ.130 కోట్లకు) వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో 120 టన్నుల సామర్థ్యం కలిగిన రెండు హార్బర్ మొబైల్ క్రేన్లు వస్తాయని, దీనివల్ల 3 మిలియన్ టన్నుల సరకు రవాణా సామర్థ్యం పెరుగుతుందన్నారు. సుమారు 150 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. స్మార్ట్ వీడియో సర్వే లెన్స్ ప్రాజెక్టును రూ.37.53 కోట్లతో చేపడుతున్నారని, దీనివల్ల పోర్టులో భద్రత, పర్యవేక్షణ సామర్థ్యం పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీభరత్, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మరో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పోర్టు ఇన్‌చార్జి చైర్మన్ అంగముత్తు, సెక్రటరీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అబుదాబీ నుంచి లిక్విడ్ పెట్రోలియం గ్యాస్‌తో విశాఖపట్నం పోర్టుకు చేరుకున్న వెరీ లార్జ్ గ్యాస్ క్యారియర్ (వీఎల్‌జీసీ) నౌక శివాలిక్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్

- వార్త మెయిన్ 9వ పేజీలో

అంబుజాతో కాలుష్యం ముప్పు

- పోర్టు ఆధారిత పరిశ్రమ అంటూ బుకాయింపు



పెదగంట్యాడ సమీపంలో అంబుజా సిమెంట్ ఏర్పాటుకు కేటాయించిన భూములు

- ఏడాదికి 40 లక్షల టన్నుల సిమెంట్ ఉత్పత్తి లక్ష్యం
- రోజుకు ఎన్‌టీపీసీ, హిందూజా పవర్‌ప్లాంట్ల నుంచి 4 వేల టన్నుల ఫ్లైయాష్ తరలింపు
- నివాస ప్రాంతాల మీదుగా రవాణా
- ఫ్లైయాష్‌లో మెర్క్యురీ, సీసం, యురేనియం, థోరియం వంటి రేడియో ఐసోటోపులతో పాటు కాడ్మియం, ఆర్సెనిక్, జింక్ వంటి లోహాలు కూడా ఉంటాయని నిపుణులు ఆందోళన
- నేడు ప్రజాభిప్రాయ సేకరణ

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): 'పోర్టు ఆధారిత అభివృద్ధి' పేరుతో అదానీ సంస్థ గంగవరం పోర్టు కోసం తీసుకున్న భూములను ఇతర పరిశ్రమలకు ఉపయోగించుకోవాలని యత్నిస్తోంది. ఇప్పుడు అందులోని ఎనిమిది హెక్టార్ల విస్తీర్ణంలో సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు నిర్ణయించింది. పెదగంట్యాడ, గాజువాక ప్రాంతాల ప్రజలు కాలుష్యంతో ఇబ్బంది పడతారని తెలిసినా వెనక్కి తగ్గడం లేదు. ఈ సిమెంట్ కంపెనీ వద్దని స్థానికులు గత నెల రోజులుగా ఆందోళన చేస్తున్నా మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాట్లుచేసింది.

ఆది నుంచి అదే ధోరణి

వైసీపీ ప్రభుత్వ హయాంలో గంగవరం పోర్టును ప్రైవేటు వ్యక్తుల నుంచి అదానీ యాజమాన్యం బలవంతంగా టేకోవర్ చేసిన సంగతి తెలిసిందే. అందులో రాష్ట్ర ప్రభుత్వం వాటాను సైతం జగన్మోహన్‌రెడ్డి అతి తక్కువ ధరకు అదానీకి కట్టబెట్టారు. దీనిపై అనేక విమర్శలు వెల్లువెత్తినా వెనక్కి తగ్గలేదు. అప్పటి నుంచి అదానీ యాజమాన్యం దూకుడుగా వ్యవహరిస్తోంది. స్టీల్ ప్లాంటుకు సరకు రవాణా హ్యాండ్లింగ్ చార్జీలను పెంచేసింది. బిల్లులు బకాయి ఉన్నారని ఆరోపిస్తూ ఒకానొక దశలో సరకు రవాణా నిలిపివేసింది. దాదాపు 45 రోజులు స్టీల్ ప్లాంటుకు ముడి సరకు రవాణా ఆగిపోయింది. దీంతో రూ.800 కోట్ల నష్టం వాటిల్లింది. రూపాయి కూడా

... మిగతా 4వ పేజీలో

నగరానికి మహిళా క్రికెటర్లు

స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా జరగనున్న వన్డే మహిళల ప్రపంచ కప్ మ్యాచ్‌లో పాల్గొనే భారత్ జట్టు సోమవారం నగరానికి చేరుకుంది. జట్టు సభ్యులకు విమానాశ్రయంలో ఆంధ్ర క్రికెట్ సంఘం ప్రతినిధులు స్వాగతం పలికారు. 9న దక్షిణాఫ్రికాతో భారత్ జట్టు తలపడనున్నది.

-వివరాలు స్పోర్ట్సు పేజీలో...



14 నుంచి 19 వరకు షాపింగ్ ఫెస్టివల్

- జీఎస్టీ 2.0పై అవగాహన కోసం నిర్వహణ
- కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రయోజనం కలిగించేలా ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు షాపింగ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ద్విచక్ర వాహనాలు, కార్లు, గృహోపకరణాలు, ఫర్నిచర్, మొబైల్స్ దుకాణాల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. జీఎస్టీ 2.0 అమలుకు వ్యాపారస్తులు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఫెస్టివల్‌కు వచ్చే కస్టమర్లకు అవగాహన కల్పించాలన్నారు. నగరంలో అందరికీ అందుబాటులో ఉండేలా ఫెస్టివల్ వేదిక ఖరారుచేస్తామన్నారు. అక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటుచేస్తామని, చివరిరోజు బాణసంచా షో ఉంటుందన్నారు. సమావేశంలో జేసీ మయూర్‌అశోక్, పన్నుల శాఖ అడిషనల్ కమిషనర్ శేఖర్, జిల్లా పర్యాటకాధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెంలో దోపిడీ

- అర్ధరాత్రి ఇంటి వెనుక వైపు తలుపులు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు
- వృద్ధురాలితో పాటు ఆమె మనుమడిని బంధించిన వైనం
- 12 తులాల బంగారం, రూ.3 లక్షల నగదుతో పాటు ఇంటిముందు పార్కు చేసిన కారు తీసుకుని పరారీ
- ఆ వాహనాన్ని మారికవలస వద్ద విడిచిపెట్టినట్టు గుర్తింపు



ఇంట్లో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

విశాఖపట్నం/కంచరపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కంచరపాలెం ఇందిరానగర్‌లో భారీ దోపిడీ జరిగింది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటి వెనుక వైపు నుంచి లోనికి ప్రవేశించిన దుండగులు నిద్రిస్తున్న వృద్ధురాలితో పాటు ఆమె మనుమడిని బంధించి ఇంట్లో ఉన్న 12 తులాల బంగారం, రూ.3 లక్షల నగదుతో పాటు కారును అపహరించుకుపోయారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

రెడ్డికంచరపాలెం ఇందిరానగర్-5లో జాతీయ రహదారి పక్కన ధర్మాల ఆనందకుమార్‌రెడ్డికి రెండు అంతస్థుల ఇల్లు ఉంది. ఆనందకుమార్‌రెడ్డితోపాటు ఆయన తల్లి యల్లయ్యమ్మ (72), భార్య కోమలి, కుమారుడు కృష్ణకాంత్‌రెడ్డి (20) నివాసం ఉంటున్నారు. ఆనందరెడ్డి ఒక శుభకార్యానికి హాజరయ్యేందుకు శనివారం హైదరాబాద్ వెళ్లారు. ఆదివారం రాత్రి పదిన్నర గంటల సమయంలో ఆనందకుమార్‌రెడ్డి భార్య కోమలి, కుమార్తె దేవికారెడ్డి నిద్రించేందుకు పైఅంతస్థులోకి వెళ్లిపోయారు. యల్లయ్యమ్మ కింద అంతస్థులోని బెడ్‌రూమ్‌లో నిద్రించగా, కృష్ణకాంత్‌రెడ్డి హాల్‌లో పడుకున్నాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ముఖానికి మాస్కులు, చేతికి గ్లౌజులు ధరించి ఇంటి వెనుక వైపు తలుపులు బద్ధలు కొట్టి లోనికి ప్రవేశించారు. అలికిడికి యల్లయ్యమ్మ లేవగా... ఆమె నోరు, చేతులకు దుండగులు ప్లాస్టిక్ టేపు వేసి బంధించారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారాన్ని బలవంతంగా లాక్కొన్నారు. అనంతరం బీరువా తెరిచి అందులో మరికొంత బంగారం, రూ.మూడు లక్షలు నగదు తీసుకున్నారు. బీరువా తెరిచినప్పుడు శబ్దం రావడంతో హాల్‌లో నిద్రపోతున్న కృష్ణకాంత్‌రెడ్డి లేచి బెడ్‌రూమ్‌లోకి రాగా, అతడిని దుండగులు కొట్టి,

... మిగతా 4వ పేజీలో



తస్కరించిన కారు

నవజాత శిశువులకు రక్ష

- ఘోషా ఆస్పత్రిలో 20 వార్మర్స్ ద్వారా వైద్య సేవలు
- బరువు తక్కువగా ఉండే చిన్నారులకు, ప్రీ మెచ్యూర్ శిశువులకు, జన్యుపరమైన సమస్యలతో పుట్టే వారికి చికిత్స
- అయితే చిన్న పిల్లల వైద్య నిపుణులు లేకపోవడంతో ఇబ్బందులు



బేబీ వార్మర్స్

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో జన్మించే శిశువుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో అటువంటి చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై ఘోషా ఆస్పత్రి అధికారులు దృష్టిసారించారు. ఇందుకోసం నవజాత శిశువుల సంరక్షణ కేంద్రంలో 20 బేబీ వార్మర్స్‌ను ఏర్పాటుచేశారు.

ఈ చిన్నారులకు వైద్యం..

నవజాత శిశువుల సంరక్షణ కేంద్రంలో 20 వార్మర్స్ అందుబాటులో ఉన్నాయి. బరువు తక్కువగా ఉండే చిన్నారులకు, ప్రీ మెచ్యూర్ శిశువులకు, జన్యుపరమైన సమస్యలతో పుట్టే వారికి అంటే గుండెలో రంధ్రాలు, ఇతర ఇబ్బందులు, ఉమ్మనీరు తాగేయడం, పచ్చకామెర్లు, ఫిట్స్, ఇతర ఇన్‌ఫెక్షన్లకు గురైన చిన్నారులకు అక్కడ చికిత్స అందిస్తారు. యాంటీ బయాటిక్స్, ఆక్సిజన్ వంటివి అందించడం ద్వారా వారు కోలుకునేలా చేస్తారు. సమస్యను బట్టి ఐదు నుంచి 15 రోజులు వార్మర్స్‌లో ఉంచుతారు.

వైద్యుల కొరత

నేషనల్ హెల్త్ మెషీన్ ప్రోగ్రామ్‌లో భాగంగా నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రంలో చేరే చిన్నారులకు వైద్యం అందించేందుకు నలుగురు చిన్న పిల్లల వైద్యులు అందుబాటులో ఉండాలి. అయితే, ఒక్కరు కూడా లేరు. ఆస్పత్రిలో ఫ్యామిలీ ప్లానింగ్ విభాగానికి చెందిన డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ప్రస్తుతం ఎస్ఎన్‌సీయూ బాధ్యతలను చూసుకుంటున్నారు. ఆయనతోపాటు కేజీహెచ్ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒకరు నవజాత శిశువులకు సేవలు అందిస్తున్నారు. అయితే, పూర్తిస్థాయి చిన్న పిల్లల వైద్య నిపుణులు అందుబాటులో లేకపోవడంతో కొన్నిరకాల ఇబ్బందులు

... మిగతా 4వ పేజీలో

గూడుపురాణి

కాంట్రాక్టర్లతో హౌసింగ్ అధికారుల కుమ్మక్కు

- పేదల ఇళ్లకు తలుపులు బిగించకపోయినా బిల్లులు
- అభ్యంతరం తెలపని అధికారులు
- కలెక్టర్ నిలదీత

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సెంటు స్థలాల్లో నిర్మిస్తున్న ఇళ్లకు కాంట్రాక్టర్లు తలుపులు అమర్చకుండా బిల్లులు తీసుకుంటున్నా హౌసింగ్ అధికారులు నోరుమెదపకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తలుపులు బిగించకపోవడంపై జిల్లా కలెక్టర్ నిలదీయడంతో హౌసింగ్ అధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



తలుపు లేని గృహం

నగర శివారు ప్రాంతాల్లో లక్ష ఇళ్లను కాంట్రాక్టర్లు నిర్మిస్తున్నారు. సెంటు స్థలంలో నిర్మించే ఇంటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.1.8 లక్షలు మంజూరుచేశాయి. ఇసుక, సిమెంట్, ఇనుము ప్రభుత్వం సరఫరా చేస్తోంది. అందుకు కొంత మొత్తం మినహాయించుకుని మిగిలిన మొత్తం కాంట్రాక్టర్లకు చెల్లించాలి. ఇందుకు సంబంధించి లబ్ధిదారులు, కాంట్రాక్టర్లు, సొమ్ములు బదలాయించే బ్యాంకు మధ్య ఒప్పందం జరిగింది. దీని ప్రకారం ప్రతి ఇంటికి ముందు ద్వారం అమర్చి తలుపులు బిగించాలి. కిటికీలు ఏర్పాటుచేయాలి. విద్యుత్ సరఫరా కోసం ఎలక్ట్రికల్ పైపులను ఇంటి లోపల గోడలకు కన్‌సీలింగ్ ద్వారా బిగించాలి. ఇంటికి ముందు వైపు ప్లాస్టింగ్ చేయాలి. ఒకవేళ లబ్ధిదారులు డ్వాక్రా సంఘాల ద్వారా అదనంగా రూ.35 వేలు చెల్లిస్తే ఇంటికి నలువైపులా ప్లాస్టింగ్, లోపల సిమెంట్‌తో ఫ్లోరింగ్, మరుగుదొడ్డిలో కమోడ్ ఏర్పాటుచేయాలి. అయితే ఇళ్ల నిర్మాణంలో తొలి నుంచి కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో నాణ్యతపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఒప్పందం మేరకు దశల వారీగా ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు అప్‌లోడ్ చేసిన తరువాత కాంట్రాక్టర్ల

... మిగతా 4వ పేజీలో

స్వచ్ఛాంధ్రకు ప్రజలు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

- విశాఖ విశిష్టత పెంచేందుకు కఠిన నిర్ణయాలు
- నగరంలో ఆపరేషన్ లంగ్స్‌తో మార్పునకు నాంది
- ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్
- రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలి: కలెక్టర్
- వేడుకగా స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవం

-6లో



సర్వర్ పనిచేయకపోవడంతో ఓపీ చీటీ కోసం పడిగాపులు

పెద్దాస్పత్రిలో ఓపీకి యాప్‌సోపాలు

- 'అభా' యాప్ సర్వర్‌లో సమస్య ఉత్పన్నం కావడంతో రోగుల పాట్లు

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో ఓపీ (అవుట్ పేషెంట్) చీటీ తీసుకునేందుకు రోగులు సోమవారం పడిగాపులు కాయాల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో డిజిటలైజేషన్ ప్రక్రియలో భాగంగా అభా పేరుతో ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న తరువాత ఓపీ చీటీ ఇస్తారు. అయితే, సోమవారం యాప్ పనిచేయకపోవడంతో రోగులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఓపీ కోసం ఆధార్, ఇతర వివరాలను నమోదు చేస్తున్న క్రమంలో సర్వర్ ప్రాబ్లమ్ అని వచ్చి ఆగిపోవడంతో క్యూలో చాలాసేపు నిరీక్షించాల్సి వచ్చింది. సాధారణంగా ఉదయం 10 గంటల సమయానికి సుమారు ఎనిమిది వందల వరకు ఓపీ ఇస్తుంటారు. సోమవారం యాప్ సమస్య తో 400 మందికి కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. అప్పటికే ఓపీ కౌంటర్ల వద్ద భారీ సంఖ్యలో రోగులు బారులు తీరడంతో మాన్యువల్ విధానంలో కొందరికి చీటీలు ఇచ్చారు. పది గంటల తరువాత మళ్లీ యాప్ పనిచేయడంతో దాని ద్వారా నర్సింగ్ సిబ్బంది రిజిస్ట్రేషన్ చేయించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్టుల బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ పి. సురేఖ తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ 55 శాతం మార్కులు, నెట్ లేదా సెట్ లేదా పీహెచ్‌డీ అర్హత కలిగి ఉండాలని చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 10న కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.పూర్తి వివరాలకు 8179780917, 9848632130 సెల్ నంబర్లను సంప్రతించాలని ఆమె సూచించారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా జరిపారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

పీజీఆర్ఎస్‌కు నాలుగు వినతులు

భీమునిపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో అధికారులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు అర్జీలు స్వీకరించారు. అన్ని వినతులు ఇంజనీరింగ్ విభాగానికి అందాయి. వాటిని ఆ శాఖాధికారులకు పంపించి వారం రోజుల్లో పరిష్కరించాలని జడ్సీ ఆదేశించారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా



జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

భీమునిపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్లాప్ వాహన కార్మికులు (హెల్పర్లు) వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జోనల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జోన్ కమిటీ సహాయ కార్యదర్శి రవ్వ నరసింగరావు మాట్లాడుతూ జోన్ వన్ పరిధిలోని 21 క్లాప్ వాహనాల కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. తక్షణమే బకాయిలు చెల్లించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అనంతరం జడ్సీ అయ్యప్ప నాయుడుకు వినతి అందించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శివ కుమార్, పోతురాజు, రమణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న కాకినాడ ఎమ్మెల్యే



కప్ప స్తంభం వద్ద ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు దంపతులు

సింహాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని కాకినాడ (సిటీ) ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఎమ్మెల్యే గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



ఆలయ అధికారికి చెక్కు అందజేస్తున్న దాత లక్ష్మీప్రసన్న

సింహాచలం,అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి పెందుర్తి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కసిరెడ్డి అప్పలస్వామి దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్ రూపంలో దేవస్థానం ప్రజా సంబంధాల అధికారి లక్ష్మీప్రసన్నకు సోమవారం వారు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

'భీమిలిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి'

భీమునిపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : భీమిలి పట్టణాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. సోమవారం ఆయన జోనల్ కార్యాలయంలో జడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న పట్టణాన్ని నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారని, బీచ్ రోడ్డులో కనీస అభివృద్ధి పనులు చేపట్టడం లేదని తెలిపారు. ముఖ్యంగా బీచ్ పార్క్, జమ్మి చెరువు పార్క్, నేరేళ్లవలస ఓపెన్ జిమ్ పార్క్, గొల్లలపాలెం సామాజిక భవనం వెనుక ఉన్న పార్కును ఏర్పాటు చేయాలని విన్నవించారు.

వైభవంగా నారసింహ స్వామి తిరువీధి



తిరువీధిలో ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి

సింహాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రినాథుడి మాస జయంత్యుత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను అలంకరించి పల్లకిలో ఉంచారు. షోడశోపచారాలు సమర్పించిన తరువాత ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ బేడా మండపంలో తిరువీధి ఉత్సవం జరిపారు. దారి పొడవునా అష్టదిక్పాలకులకు పూజలు చేసి నీరజనాలు, నివేదనలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అక్కరకు రాని బ్యాటరీ కార్లు

- దాతలు ఇచ్చిన కానుకల పట్ల అధికారుల నిర్లక్ష్యం
- భక్తుల సేవలకు పూర్తిగా దూరం
- ఒకటి ముళ్ల పొదల్లో.. ఇంకొటి కాటేజీ వద్ద నిలిపివేత

సింహాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన కోరమండల్ కంపెనీ రూ. 8.4 లక్షలు సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసి సింహాచలం దేవస్థానానికి కానుకగా ఇచ్చిన బ్యాటరీ కారు సింహగిరిపై కాటేజీ వద్ద నిరుపయోగంగా పడి ఉంది. గత నెల 30న సింహగిరిపై జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఈ కారును దేవస్థానం అధికారులకు బహూకరించారు. నాటి నుంచి నేటి వరకు కారును వినియోగించిన దాఖలాలు లేవు. దీనికి గల కారణాలు తెలియడం లేదు. దాతలు బహూకరించిన పలు కానుకలను అధికారులు నిరుపయోగంగా వదిలేయడంపై భక్తులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. అలాగే అప్పన్నస్వామి దర్శనానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణీల రవాణా సౌకర్యం నిమిత్తం దాత వితరణగా అందించిన బ్యాటరీ కారు నిర్వహణ లోపం వల్ల నిరుపయోగంగా ఉంది. ఏడేళ్ల క్రితం దేవస్థానం అధికారుల అభ్యర్థన మేరకు ఎస్‌బీఐ సింహాచలం శాఖ సీఎస్ఆర్ నిధులు సుమారు రూ. 8 లక్షలు వెచ్చించి ఈ కారును అందజేసింది.అతి తక్కువ కాలం మాత్రమే కారును భక్తుల రవాణాకు వినియోగించారు. తరువాత కొద్దిపాటి సాంకేతిక సమస్య వల్ల నిలిచిపోయింది. అనంతరం నిర్వహణను పూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం ఇది కృష్ణాపురంలో దేవస్థానానికి చెందిన నృసింహవనంలో తుప్పల మధ్య నిరుపయోగంగా పడి ఉంది.



కాటేజీ వద్ద నిరుపయోగంగా ఉన్న బ్యాటరీ కారు



కృష్ణాపురంలో దేవస్థానానికి చెందిన నృసింహవనంలో తుప్పల మధ్య వృథాగా పడి ఉన్న కారు

రూ. 10 కోట్లతో అభివృద్ధి పనులు



వార్డులో పర్యటిస్తున్న అధికారులు

సింహాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో వచ్చే నెలలో జరగనున్న ఐఎఫ్ఆర్‌లో పాల్గొనేందుకు వచ్చే విదేశీయుల రాకపోకలకు అనుగుణంగా బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ పరిధిలో రూ. 10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం తెలిపారు. సోమవారం ఆయన జోన్-8 ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీరు దిలీప్‌తో కలిసి వార్డులో సింహాచలం కారిడార్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయిలో సమీక్షించారు.

ఘనంగా గణపతి, అయ్యప్ప విగ్రహాల ప్రతిష్ఠ

తగరపువలస, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జ్యూట్ మిల్లు రామాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బ్రహ్మశ్రీ మహేంద్రాడ రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో 11 మంది రుత్విక్‌ల బృందంతో గణపతి, పార్వతీ అరుణాచలేశ్వర స్వామి, అయ్యప్ప విగ్రహాలను సోమవారం ఘనంగా ప్రతిష్ఠించారు. ఆలయ అర్చకులు ఆకెళ్ల ఫణిరామ్ భాగ్యరాజ్ శర్మ, రవి గణేశ్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం చీరాల సద్గురు శివకేశవ భజన సమాజం ఆధ్వర్యంలో భజన చేపట్టారు. మధ్యాహ్నం వేలాది మందికి అన్నప్రసాదం వడ్డించారు. సాయంత్రం అయ్యప్ప ఆలయంలో మవుడూరి యోగేశ్వర శర్మ ఆధ్వర్యంలో పడి పూజ నిర్వహించారు.

రీసర్వేలో అక్రమాలపై విచారణ జరపాలి

రెవెన్యూ సదస్సులో రైతుల డిమాండ్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

పద్మనాభం రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్త కొవ్వాడ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 237లో ఇటీవల చేపట్టిన రీసర్వేలో అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందని బాధిత రైతులు తెలిపారు.రీసర్వేను రద్దు చేసి రైతుల సమక్షంలో మరోసారి సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సాయంత్రం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ కాకర ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో జరిగిన రీసర్వేలో సెంటు భూమి లేనివారికి కూడా భూమి ఉన్నట్టు స్థానిక రెవెన్యూ సిబ్బంది రికార్డులు సృష్టించారన్నారు. తమ తాతతండ్రుల నుంచి భూమి సాగు చేసుకొని జీవిస్తున్నామని, గ్రామానికి చెందిన కొంతమంది పదవులను అడ్డు పెట్టుకొని బినామీ పేర్లతో రీ సర్వేలో భూములను బదలాయించారని ఆరోపించారు.దీనిలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏల పాత్ర ఉందని ఆరోపించారు. తహశీల్దార్ మాట్లాడుతూ డీఆర్ రిజిష్టర్ ప్రకారం అసలైన రైతులకు న్యాయం చేస్తామన్నారు. రైతుల సమక్షంలో తిరిగి రీసర్వే చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వే డీటీ శ్రీనివాసరావు, వీఆర్‌ఓ సుమిత్ర, వీఆర్ఏ ఎస్. వరం, తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

ఆనందపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శొంఠ్యాం పంచాయతీ యాతపేటలో ఒకే కుటుంబానికి చెందిన ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ వాసునాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈనెల 4వ తేదీన దుర్గాదేవి నిమజ్జనం ఊరేగింపులో రెండు కుటుంబాల మధ్య చిన్నపాటి వివాదం తలెత్తింది. మరుసటి రోజు (ఆదివారం) సాయంత్రం కూడా అదే విషయమై చుక్క జగదీశ్ (23), చుక్క అప్పలరాజు (26), చుక్క కార్తీక్ (27)మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. జగదీశ్, అప్పలరాజు కత్తితో కార్తీక్‌పై దాడి చేసే సమయంలో చుక్క అప్పలనాయుడు (64) అడ్డుపడ్డాడు. దాడిలో అప్పలరాజు మెడపై బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా డీఎస్సీ పోస్టుల భర్తీ

విదసం ఐక్యవేదిక

మధురవాడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో మెరిట్ ర్యాంకర్లను రిజర్వేషన్‌లో లెక్కించడం చట్ట విరుద్ధమని, దీనివల్ల రిజర్వేషన్ అభ్యర్థులు నష్టపోయారని విశాఖ దళిత సంఘం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు ఆరోపించారు. మధురవాడలోని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట విదసం ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ నియామకాల్లో మెరిట్ అభ్యర్థులను ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల రిజర్వేషన్‌లోకి తీసుకోవడంతో ఆయా వర్గాల అభ్యర్థులు నష్టపోయారని చెప్పారు. రిజర్వేషన్ అభ్యర్థుల్లో కొందరికి ఈ కారణంగానే ఉద్యోగాలు రాలేదని తెలిపారు. నోటిఫికేషన్‌లో రిజర్వేషన్ల అమలు 2023 జీఓ నంబరు 77 రూల్ ప్రకారం ఉంటాయని చెప్పిన ప్రభుత్వం జీఓలో రెండవ క్లాజు విస్మరించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కటాఫ్ మార్కులు దాటి మెరిట్ సాధిస్తే వారిని రిజర్వేషన్ కోటాలో లెక్కించకూడదని కోర్టు తీర్పు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఉల్లంఘించిందన్నారు. విద్యా శాఖాధికారులు తప్పును సవరించి నిబంధనల ప్రకారం మెరిట్ దాటిన వారిని ఓపెన్ కేటగిరీలో ఉంచి రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలో నష్టపోయిన అభ్యర్థులు వారి ర్యాంకు కార్డులతో రీజనల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో విదసం నాయకుడు భాస్కరరావు, పలువురు డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

నవజాత శిశువులకు రక్ష

... 3వ పేజీ తరువాయి

ఉత్పన్నమవుతున్నాయని, వారికి మెరుగైన సేవలందించేందుకు నలుగురు వైద్యులను కేటాయించాలని అధికారులు కోరుతున్నారు.

నాణ్యమైన సేవలు అందిస్తున్నాం

- డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, ఘోష ఆస్పత్రి

నవజాత శిశువుల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు ప్రత్యేకంగా ఎస్ఎన్‌యూసీ ఉంది. ఇక్కడ 20 వార్మర్స్‌తో సేవలు అందిస్తున్నాం. చిన్నపిల్లల వైద్య నిపుణులు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పూర్తిస్థాయి వైద్య నిపుణులను కేటాయిస్తే మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. ప్రతిరోజూ 10 నుంచి 15 మంది చిన్నారులు నవజాత శిశువుల సంరక్షణ కేంద్రంలో ఉం టున్నారు. పిల్లలు పూర్తిగా కోలుకున్న తరువాత వ్యాక్సినేషన్ చేయించి డిశ్చార్జ్ చేస్తున్నాం.

టీడీపీ కార్యాలయానికి నూతన భవనం

పద్మనాభం మండల అధ్యక్షుడు రమణ



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రమణ

పద్మనాభం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయం నూతన భవన నిర్మాణానికి నాయకులు, కార్యకర్తలు సహకరించాలని పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ కోరారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహం ఆవరణలో నిర్వహించిన మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మనాభం జంక్షన్‌లో పార్టీ కార్యాలయాన్ని అన్ని వసతులతో నిర్మించనున్నట్టు చెప్పారు. దీనికి రూ. 50 లక్షలు వ్యయం అవుతుందన్నారు. జనవరి 18 నాటికి భవన నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మండల, గ్రామస్థాయిలో నామినేటెడ్ పదవులు పొందిన వారితో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.అనంతరం పార్టీ కార్యాలయం నిర్మాణాన్ని నాయకులు పరిశీలించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కె. లీలావతి, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పి. జగన్నాథం, డైరెక్టర్లు వాళ్ల నందిని, కె. లక్ష్మి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గంగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, ఇతర నాయకులు కె. నగేశ్‌కుమార్, కె. రామరాజు, జి. మహేశ్వరరావు, కేవీ సత్యనారాయణ, పైడినాయుడు, అచ్చింనాయుడు, ఐటీడీపీ నాయకులు సూర్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.



తర్లువాడలో ఉపాధ్యాయులతో ఎంపికైన విద్యార్థులు



విజేతలతో చిట్టివలస పాఠశాల హెచ్ఎం ఆదినారాయణ

రాష్ట్రస్థాయి పోటీలకు తర్లువాడ, చిట్టివలస విద్యార్థులు

ఫుట్‌బాల్, రెజ్లింగ్ విభాగాల్లో ఎంపిక

ఆనందపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తర్లువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఏయూలోని ఇంజనీరింగ్ మైదానంలో నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్ 17 బాలికల విభాగంలో ఉషా, పుష్ప, అండర్ 17 బాలుర విభాగంలో ఆదర్శ్ ఎంపికయ్యారు.విద్యార్థులను పాఠశాల హెచ్ఎం పి. జ్యోతి, పీడి పొన్నాల మాధవరావు, తదితరులు అభినందించారు.

తగరపువలస : రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం డి. ఆదినారాయణ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీలు జరిగాయి. వీటిలో అండర్ 17 విభాగంలో ఎస్. శశిధర్ 80 కిలోల కేటగిరీలోను, ఇ. ధరహాస్ 110 కిలోల కేటగిరీలోను విజేతలుగా నిలిచారు. అలాగే అండర్ 17 బాలికల విభాగంలో వి. ఈక్షిత, బి. ఆదిలక్ష్మి విజేతలుగా గెలుపొందారు. ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో అండర్ 14 విభాగంలో జి. గీతాశ్రీ ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విద్యార్థులను, పీడీ అచ్యుతరావును, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు అభినందించారు.

అంబుజాతో కాలుష్యం ముప్పు

... 3వ పేజీ తరువాయి

పరిహారం ఇవ్వలేదు. స్థానిక నిర్వాసిత మత్స్యకారులు ఎవరూ పోర్టులో పనికి రాకుండా జాగ్రత్తలు తీసుకుంది. భూములు ఇచ్చిన వారి పట్ల ఏమాత్రం కనికరం చూపించలేదు.

రోజూ 4 వేల టన్నుల ఫ్లైయాష్ రవాణా

పెదగంట్యాడకు అత్యంత సమీపాన అంటే సుమారుగా 130 మీటర్ల దూరంలో అంబుజా సిమెంట్ కంపెనీ నూతన యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి అదానీ సంస్థ (అంబుజా సిమెంట్స్‌ను ఏడాది క్రితం అదానీ టేకోవర్ చేసింది) ఏర్పాట్లు చేస్తోంది. ఏడాదికి 40 లక్షల టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. దీని కోసం సమీపంలోని ఎన్‌టీపీసీ, హిందూజా థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి ఫ్లైయాష్‌ను రోజుకు నాలుగువేల టన్నులు తీసుకుంటామని చెబుతోంది. అంటే ఫ్లైయాష్ లారీలు నివాస ప్రాంతాల మీదుగా దాదాపుగా 14 కి.మీ ప్రయాణం చేస్తాయి. వాటి కాలుష్యం అంతా అక్కడి ప్రజలపైనే పడుతుంది. ఈ ఫ్లైయాష్‌లో విషపూరితమైన మెర్క్యురీ, సీసం, యురేనియం, థోరియం వంటి రేడియో ఐసోటోపులతో పాటు కాడ్మియం, ఆర్సెనిక్, జింక్ వంటి లోహాలు కూడా ఉంటాయని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ ఫ్లైయాష్ వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు వస్తాయని చెబుతున్నారు.

నీటికీ కష్టాలే

సిమెంట్ తయారీకి నీరు అవసరం ఎక్కువ. రోజుకు 4 వేల కిలోలీటర్లు కావాలి. ఈ పరిశ్రమకు అవసరమైన నీటిని అందించే సామర్థ్యం ప్రస్తుతం జీవీఎంసీకి లేదు. భూగర్భ జలాలు ఉపయోగించకూడదనే నిబంధన ఉంది. అందుకని అదానీ యాజమాన్యం తప్పుడు నివేదిక సమర్పించింది. గాజువాకలో మురుగునీటి శుద్ధి కేంద్రం నుంచి రోజుకు 400 కిలో లీటర్లు తీసుకుంటామని నివేదికలో పేర్కొంది. వాస్తవానికి గాజువాకలో ఆ కేంద్రమే లేదు. అది జీవీఎంసీ వద్ద ప్రతిపాదన దశలోనే ఉంది. దానిని నివేదికలో చూపించి, అక్కడి నుంచి నీటిని తీసుకుంటామని ప్రభుత్వ అనుమతులు కోరుతోంది. మిగిలిన నీటిని అంటే రోజుకు 3,600 కిలోలీటర్లు ఏలేరు కాలువ నుంచి తీసుకుంటుంది. దానివల్ల స్థానిక ప్రజలకు తాగునీటి సమస్యలు ఎదురవుతాయి. ఇవేవీ పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో పొందుపరచకపోవడం గమనార్హం.

గ్రామీణ అభివృద్ధికి తోడ్పాటు

ఈ సిమెంట్ పరిశ్రమ వల్ల గ్రామీణాభివృద్ధి జరుగుతుందని అదానీ యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. పెదగంట్యాడ, పరిసర ప్రాంతాల ప్రజలకు జీవనాధార అవకాశాలు మెరుగుపడతాయని తెలిపింది.

కంచరపాలెంలో దోపిడీ

... 3వ పేజీ తరువాయి

నోటికి, చేతులకు ప్లాస్టిక్ టేపు వేసి బంధించారు. అతని చేతికి ఉన్న డైమండ్ రింగ్‌ను లాక్కొన్నారు. అనంతరం బెడ్‌రూమ్‌లోని టీవీ స్టాండ్‌పై ఉన్న కారు తాళాలను తీసుకుని కిందకు వెళ్లిపోయారు. ఇంటి ముందు పార్కు చేసి ఉన్న కారుతో దుండగులు ఉడాయించారు. దీనిపై యల్లయ్యమ్మ సోమవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదుచేసి దర్యాప్తు నిమిత్తం క్రైమ్ పోలీసులకు బదిలీ చేశారు. దుండగులు ముఖానికి మాస్కులు, చేతికి గ్లౌజ్‌లు వేసుకున్నారని, జీన్‌ప్యాంట్లు ధరించి ఉన్నారని, హిందీలో మాట్లాడారని యల్లయ్యమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిని బట్టి బిహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఠా పని అయి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు.

మారికవలస వద్ద కారును వదిలేసిన దుండగులు

ఆనంద్‌కుమార్‌రెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగులు అతని కారుని మారికవలస వద్ద వదిలేసి అక్కడి నుంచి వేరొక వాహనంలో పరారైపోయారు. ఘటనా స్థలంతోపాటు చుట్టుపక్కల సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దుండగులు రాత్రి 12.30 గంటల సమయంలో ఒక కారులో జాతీయ రహదారిపై దిగి అక్కడి నుంచి రోడ్డు దాటి ఆనంద్‌కుమార్‌రెడ్డి ఇంటి వైపు వచ్చినట్టు గుర్తించారు.ఎయిర్‌పోర్టు లేదంటే రైల్వేస్టేషన్ నుంచి ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి యాప్‌ల ద్వారా కారును బుక్ చేసుకుని అక్కడికి వచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు. చోరీకి పాల్పడిన తర్వాత ఆనంద్‌కుమార్‌రెడ్డి కారులో ఎన్ఏడీ, సింహాచలం మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డులో వెళ్లినట్టు గుర్తించారు. పెదగదిలి జంక్షన్ వద్ద కారును ఆపి ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడి తర్వాత హనుమంతవాక మీదుగా మారికవలస వైపు వెళ్లినట్టు గుర్తించారు. అక్కడ కారును రోడ్డుపక్కన ఆపి మరో వాహనంలో శ్రీకాకుళం వైపు వెళ్లిపోయినట్టు పోలీసులు భావిస్తున్నారు. చోరీకి పాల్పడింది అంతర్ రాష్ట్రముఠా అయితే వారికి ఆనంద్‌కుమార్‌రెడ్డి ఇంట్లో లేరని, కింది పోర్షన్‌లో వృద్ధురాలు, ఆమె మనుమడు మాత్రమే ఉంటారని ఎలా తెలుస్తుందని పోలీసులు అనుమానిస్తున్నారు. జాతీయ రహదారిపై కారుదిగిన దుండగులు ఎలాంటి తడబాటు లేకుండా నేరుగా ఆనంద్‌కుమార్‌రెడ్డి ఇంటికే వెళ్లడం బట్టి చూస్తే స్థానికుల సహకారం ఏమైనా ఉందా?...అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు.

గూడుపుఠాణి

... 3వ పేజీ తరువాయి

ఖాతాలకు సొమ్ములు జమ కావాలి. ప్రతి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన తరువాతే అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేయాలి. కానీ కాంట్రాక్టర్లతో కొందరు అధికారులు మిలాఖత్ కావడంతో త్రైపాక్షిక ఒప్పందం అమలు జరగడం లేదు. ఇళ్లకు ద్వారాలు ఏర్పాటుచేసి, తలుపులు బిగించలేదు. కిటికీలు లేవు. ఇంటిలోపలకు వెళ్లేందుకు ముందున మెట్లు కట్టలేదు. లోపల ఎలక్ట్రికల్ కన్‌సీలింగ్ చేయలేదు. అయినా కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసేశారు. ప్రధానంగా వేల సంఖ్యలో ఇళ్లు నిర్మించే కాంట్రాక్టర్లు ఎక్కువ ఉల్లంఘనలకు పాల్పడ్డారు. వీరికి ఉన్నత స్థాయిలో పలుకుబడి ఉండడంతో అధికారులు కనీసం ప్రశ్నించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన కాంట్రాక్టర్లు ఇప్పుడు కూడా పెత్తనం చెలాయిస్తున్నారు. మొత్తం బిల్లు డ్రా చేసేసి నిర్మాణ బాధ్యతల నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తలుపులు, కిటికీలు బిగించకపోవడం వల్ల ఒక్కో ఇంటికి కనీసం పది వేలు మిగులుతుంది. అయినా అధికారులు మాట్లాడడం లేదు. కొందరు అధికారులు అందినకాడికి దండుకున్నారు. అయితే ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఇటీవల జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ సమీక్షించినపుడు, తలుపులు, కిటికీలు, కన్‌సీలింగ్‌పై ప్రశ్నించడంతో అధికారులు కంగారుపడ్డారు. ప్రతి ఇంటికి తలుపు బిగించాల్సిందేనని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లను ఒప్పించి తలుపులు, కిటికీలు బిగించేలా అధికారులు ఏమి చేస్తారో చూడాలి.

శరవేగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణం



నిర్మాణంలో ఉన్న ట్యాంక్

సింహాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన నృసింహవనంలో దాతల సహకారంతో వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్నారు. సుమారు రూ. 40 లక్షలతో నిర్మిస్తున్న ఈ ట్యాంక్‌లో లక్ష లీటర్ల నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉంటుంది.సమీపంలోని సోలార్ పవర్ ద్వారా బోరు నుంచి నీటిని ట్యాంకులోకి నింపి దాని ద్వారా గోశాలలోని అన్ని షెడ్‌లకు ప్రత్యేక పైప్‌లైన్‌తో గోవులకు అందజేయనున్నారు. ట్యాంక్ నిర్మాణాన్ని దాతలే స్వయంగా నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి తపాలా శాఖ ఆధార్ శిబిరాలు

ఎంవీపీ కాలనీ,అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ తపాలా శాఖ వారోత్సవాల సందర్భంగా ఆ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈనెల 14 వరకూ ఆధార్ శిబిరాలు నిర్వహిస్తారు. నగరంలోని వివిధ తపాలా కార్యాలయాలు,పాఠశాలలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీ తదితర ప్రదేశాల్లో ఆధార్ బయోమెట్రిక్ అప్ డేట్ సేవలందిస్తామని సీనియర్ పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్ గజేంద్ర కుమార్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ నమోదు సేవలు ఉచితంగా లభిస్తాయని పేర్కొన్నారు.

కుట్టు శిక్షణ

వెంకోజీపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ జౌళి మంత్రిత్వశాఖ సహకారంతో సమర్థ్ ప్రోగ్రాం కింద 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల, 8వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎలీప్ విశాఖ అధ్యక్షురాలు కె.రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి డాక్టర్స్ కాలనీలో ఉన్న ఏలీప్ సంస్థలో మహిళలకు ఇండస్ట్రియల్ గార్మెంట్ తయారీలో శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు ఆమె పేర్కొన్నారు. శిక్షణ పొందినవారికి ప్రామాణిక సర్టిఫికెట్లు కూడా జారీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రమాదేవి కోరారు. వివరాలకు ఫోన్ (63014 41183)లో సంప్రదించాలన్నారు.

అన్నదాన కార్యక్రమాలు

ఆరిలోవ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 11వ వార్డు పరిధిలోని కైలాసనగర్‌లో యంగ్ బాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. సుమారు 2,500 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సాయిరాం కేటరింగ్ గంగరాజు, మోది అప్పారావు, బర్రి సూర్యనారాయణ పాల్గొన్నారు. పెదగదిలి శివాలయం సమీపంలో విజయదుర్గా అమ్మవారి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. సుమారు ఆరు వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమం ధూలి రఘు ఆధ్వర్యంలో జరిగింది.

ఐటీ కంపెనీల సీఈవోలతో సమావేశం

కొమ్మాది, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో పనిచేస్తున్న ఐటీ కంపెనీల సీఈవోలతో టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ సోమవారం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సీఈవోలు మాట్లాడుతూ ఐటీ హిల్స్‌లో మౌలిక వసతుల కొరత ఉందని, ఉద్యోగులకు రవాణా సదుపాయం అందుబాటులో ఉండడం లేదని చెప్పారు. అలాగే రాత్రి సమయంలో మహిళా ఉద్యోగుల ఇబ్బందులపై ఏకరువు పెట్టారు. ఐటీ హిల్స్‌లో సమస్యలను మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని రవితేజ హామీ ఇచ్చారు.

సినిమా గైడ్

● **కాంతార-2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
● **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
● **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **ఘాటీ** : ముక్తాస్, (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 20, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 62, దొండకాయలు 44, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 32, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270


పార్కులో అంతర్గత రోడ్ల దుస్థితి, తుప్పు పట్టిన ఆట వస్తువులు


పార్కులో విరిగిపోయిన చెట్లు, ఎండిపోయిన కొమ్మలు

కళావిహీనంగా శ్రీనివాస ఉద్యానవనం

- ఆలయ కమిటీ నిర్లక్ష్యం ఫలితం
- ఎండిపోయిన మొక్కలు, విరిగిపోయిన చెట్లు
- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- సందర్శకులకు ఆహ్లాదం కరువు
- పట్టించుకోని అధికారులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరులో ఉన్న శ్రీనివాస ఉద్యానవనం కనీస నిర్వహణకు నోచుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం.. ఆలయ కమిటీ అలసత్వం వల్ల పార్కు కళావిహీనంగా తయారైంది. ఎంవీపీ కాలనీలో అన్ని సెక్టర్లలో ఉద్యావవనాలు ఉన్నాయి. వాటిని స్థానిక కమిటీలు నిర్వహిస్తుంటాయి. వాటి అభివృద్ధి మాత్రం జీవీఎంసీ చేస్తుంది. కానీ ఇక్కడి పరిస్థితి పూర్తిగా భిన్నం. పార్కు


ప్రవేశమార్గం వద్ద అధ్వానంగా ఉన్న పరిసరాలు

బయట బోర్డుపై స్పష్టంగా వేంకటేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయస్వామి ఆలయ కమిటీ ఉద్యానవనం నిర్వహిస్తున్నట్టు రాసుకున్నారు. పార్కు ఎదురుగా ఆలయం ఉండడంతో నిర్వహణ బాధ్యత కమిటీ తీసుకుంది. కానీ ఇక్కడి పరిస్థితి చూస్తే, ఇలాంటి అధ్వాన పార్కు నగరంలో మరెక్కడా కనిపించదంటే అతిశయోక్తి కాదు. పార్కు నిర్వహణను కొన్నేళ్లుగా ఆలయ కమిటీ గాలికి వదిలేసింది. స్థానికులు కూడా ఈ పార్కు వైపు కన్నెత్తి చూడడం మానేశారు. పార్కు దుస్థితిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లే వారూ కరువయ్యారు. అధికారులు కూడా ఎవరూ అడగడం లేదన్న భావనతో ఇటువైపు చూడడం మానేశారు. వెరసి ఉద్యానవనం కళావిహీనంగా తయారయ్యింది. కనీస శుభ్రత లేకపోవడం వల్ల పార్కు అంతా ఎండిపోయిన ఆకులు, కొమ్మలు, రెమ్మలతో నిండిపోయింది. అంతర్గత రహదారులు నడవడానికి వీలు లేనంతగా గోతులు పడ్డాయి. పిల్లలు ఆడుకునే వస్తువులు తుప్పు పట్టి, ప్రమాదకరంగా మారాయి. చాలా కాలంగా వీటిని మరమ్మతులు గాని, పెయింటింగ్ గాని చేయలేదు. పార్కులో ఒకవైపు పడిపోయిన చెట్లు, విరిగిపడిన కొమ్మలు ఉన్నాయి. ఆలయం ఎదురుగా ఇంత దారుణంగా ఉద్యానవనం కనిపిస్తున్నా.. ఎవరికీ పట్టకపోవడం గమనార్హం. కనీసం అధికారులైనా పార్కును అభివృద్ధి చేస్తే, పిల్లలకు, వృద్ధులకు మేలు చేసినవారవుతారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎంవీపీ రైతు బజారుకు రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారం

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ఉత్తమ రైతుబజారు అవార్డును ఎంవీపీ కాలనీకి అందజేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా రైతుబజారు ఎస్టేట్ అధికారి వరహాలు సర్టిఫికెట్, మెమొంటో అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ పి. సుధాకర్ కూడా పాల్గొన్నారు.

ద్వారకా బస్‌స్టేషన్‌కు జిల్లాస్థాయి అవార్డు

ద్వారకా బస్‌స్టేషన్ : నగరంలోని ద్వారకా బస్‌స్టేషన్‌కు స్వచ్ఛ బస్‌స్టేషన్ అవార్డు లభించింది. సోమవారం ఉడా ఆడిటోరియంలో స్వచ్ఛాంధ్ర అవార్డు కార్యక్రమంలో ఏడాది పాటు నిర్వహించిన స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగంగా ఈ బస్ స్టేషన్ అవార్డు సొంతం చేసుకుంది. ఈమేరకు ఆర్ఎం అప్పలనాయుడు ఎంపీ శ్రీభరత్, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు ఎమ్మెల్యేలు విష్ణు కుమార్‌రాజు, వంశీకృష్ణ, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అలాగే పాఠశాలల విభాగంలో భీమిలి కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగకుమారి, పంచాయతీల విభాగంలో టి. నగరపాలెం పంచాయతీ సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి అవార్డులు అందుకున్నారు.



సీఎం చంద్రబాబు చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న ఎంవీపీ బజారు ఈ.ఓ వరహాలు





కలెక్టర్ చేతుల మీదుగా స్వచ్ఛ అవార్డులు అందుకుంటున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, భీమిలి మండలం టి. నగరంపాలెం సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి, భీమిలిలోని గొల్లలపాలెం కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగాకుమారి (ఎడమ నుంచి కుడి వైపు)

భవిష్యత్తు తరాలకు క్లీన్ ఎనర్జీ ఆవిష్కరణలు

- ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సిరిపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా భవిష్యత్తు తరాలకు క్లీన్ ఎనర్జీ ఆవిష్కరణలు అందించడమే లక్ష్యమని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ అన్నారు. సోమవారం కార్పొరేట్ కార్యాలయంలో అఖిలేష్ కుమార్ దీక్షిత్, సీనియర్ అధికారులతో కలసి సమావేశం నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల సేవలను మెరుగుపరచడం,స్థిరమైన ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం, భూతాపాన్ని తగ్గించడం లక్ష్యంగా ప్రపంచ స్థాయి క్లీన్ ఎనర్జీ టెక్నాలజీ అమలుకు రోడ్ మ్యాప్ రూపొందించారు. ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలులో దేశంలోనే ఈపీడీసీఎల్ అత్యుత్తమ పనితీరు కనబరిచి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఉజాల పథకం కింద రాష్ట్రంలో ఏటా 2,863 మిలియన్ కిలోవాట్స్ విద్యుత్‌ను ఆదా చేస్తున్నామన్నారు. ఫలితంగా రూ.1,145 కోట్లు ఆదా చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో మెరుగైన సేవలు అందించేలా తగిన కార్యాచరణతో ముందుకెళ్తున్నట్టు చెప్పారు.


సీఎండీ పృథ్వీతేజ్‌కు నివేదిక అందజేస్తున్న ఈఈఎస్ఎల్ ప్రతినిధి

'ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి'


గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రూపేశ్

పద్మనాభం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) :గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.రూపేశ్ చెప్పారు. సోమవారం ఆయన కృష్ణాపురంలో జరిగిన గ్రామసభలో మాట్లాడారు. గ్రామ సమస్యలు ఉంటే సభలో తెలిపాలని చెప్పారు. అనంతరం కాలనీ గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీభవానీ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి అప్పలనాయుడు, గృహ నిర్మాణ శాఖ ఏఈ పద్మ పాల్గొన్నారు. కాగా పద్మనాభంలో పారిశుధ్య పనులను ఎంపీడీఓ పరిశీలించారు.జంక్షన్‌లో వాడుక నీరు నిల్వ ఉండడంతో వ్యాపారులతో మాట్లాడి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వాడుక నీరు రోడ్డుపై విడిచిపెట్టకుండా పైపులైను వేసుకోవాలని సూచించారు.


సముద్ర తీర ప్రాంతంలో జీవీఎంసీ సిబ్బంది వాహనాలతో వేసిన వ్యర్థాలు, చెత్త



డంపింగ్ యార్డులా పెదజాలరిపేట

- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
- వ్యాధులకు గురవుతున్న స్థానికులు

పెదవాల్తేరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలో జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేట వాల్తేరు డిపో సముద్ర తీర ప్రాంతంలో కనీస సౌకర్యాలు లేవని, జీవీఎంసీ సిబ్బంది తమ వాహనాలతో వ్యర్థాలు, చెత్త తీసుకు వచ్చి తీర ప్రాంతంలో వేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ కూడా దృష్టి పెట్టడం లేదు. తీరంలోని శ్మశానం గోడకు అనుకుని పక్కన ఉదయం, సాయంత్రం, రాత్రుళ్లు జన సంచారం తక్కువగా ఉండటం చూసి కొందరు జీవీఎంసీ సిబ్బంది తమ వాహనాలతో పెదజాలరిపేటతో పాటు పలు ప్రాంతాల నుంచి వ్యర్థాలు తీసుకు వచ్చి ఇక్కడ పడేస్తున్నారని, దీంతో దుర్వాసన వెదజల్లుతూ, పలు వ్యాధులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా వారు స్పందించి వ్యర్థాలు తరలించే వాహనదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

29 మందికి కారుణ్య నియామకాలు

మహారాణిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాలలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసేందుకు 29 మందికి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సోమవారం పత్రాలు అందించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్‌లతో కలసి 16 మందికి జూనియర్ అసిస్టెంట్లుగానూ, 8 మందికి టైపిస్టులుగా, ఐదుగురికి సబార్డినేట్లుగా నియమించారు.


మాట్లాడుతున్న సయ్యద్ బాషా

మైనారిటీ మోర్చాను బలోపేతం చేయండి

బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా

పెదవాల్తేరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మైనారిటీ మోర్చాను ఆంధ్రప్రదేశ్‌లో బలోపేతం చేయాలని మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం బీజేపీ నగర కార్యాలయంలో షేక్ నూర్ షరీఫ్ అధ్యక్షతన ఉత్తరాంధ్ర, గోదావరి జోనల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సయ్యద్ బాషా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ మైనారిటీ మోర్చాను బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎక్కువగా నిధులిచ్చి అర్హులైన మైనారిటీలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో క్రిస్టియన్, ముస్లింలు, జైనులలో అత్యధిక శాతం బీజేపీలో చేరడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక అధ్వర్యంలో బిషప్ దంపరాయి చలపతిలకు సయ్యద్ బాషా కండువాలు వేసి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర మాజీ నాయకుడు చింతాడ మోహన్‌రావు, రవికుమార్ పునుమాక, నూర్ బాషా, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఇబ్రహీం బాషా, స్థానిక నాయకులు సయ్యద్ బాషా, అబ్దుల్ గని, రాసపాపిటి రాజు, సాధిక్ బాషా తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, తదితరులు

సినీ సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న నగరంలో జరగనున్న సినీ సంగీత విభావరికి సంబంధించి పోస్టర్‌ను తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం విడుదల చేశారు. ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో స్వర కళానిధి సంస్థ ప్రతినిధుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రైల్వే ప్రసాద్ మాట్లాడుతూ 8న పౌర గ్రంథాలయంలో సోమేష్ సంగీత నిర్వహణలో 'చిగురులు వేసిన కలలనీ' పేరిట సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ గాయనీగాయకులు పాల్గొంటారని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. రైల్వే విశ్రాంత అధికారి నాయుడు, గాయకులు పెమ్మరాజు రామారావు, పుండరీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన గడువులోగా వినతులు పరిష్కారం


వినతులు పరిశీలిస్తున్న ప్రణవ్‌గోపాల్

సిరిపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ ప్రజా దర్బార్‌కు వచ్చిన వినతులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏలో ప్రజా దర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.9 వినతులు రాగా, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారులకు సూచించారు.. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నందున అధికారులంతా అంకితభావంతో పనిచేయాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ రమేశ్, కార్యదర్శి మురళి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వర్షంతో రోడ్లు బురదమయం


బురదమయమైన ఇసుకతోటలో రజకవీధి రోడ్డు

వెంకోజీపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి 15, 16 వార్డుల్లోని రోడ్లు చెరువులను తలపించి సోమవారం ఉదయానికి బురదగా మారాయి. దసరా తరువాత విధులకు హాజరైన శానిటరీ సిబ్బంది చేతి నిండా పని తగిలింది. తెల్లవారుజాము నుంచి బాబ్‌కాట్‌తోనూ, చీపురులతోనూ శానిటరీ సిబ్బంది శుభ్రం చేశారు. కాలువలలో అడ్డుగా ఉండిపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, స్థానికుల సాయంతో నీటిని తీసుకుని రోడ్లను శుభ్రంగా కడిగారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎస్.కిషోర్, సూరిబాబు, శుభ్రం మేస్త్రీలు నమ్మి చిన్నరాజు, రమణ, జి.బాబు, కృష్ణ, బంగార్రాజు, ఇతర సిబ్బంది ఉన్నారు.

జగన్ విశాఖ పర్యటన విజయవంతం చేయాలి

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

మద్దిలపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన రెడ్డి విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9న జగన్ నర్సీపట్నం వైద్య కళాశాల సందర్శనకు వస్తున్నారని, కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. ప్రతీ పేద విద్యార్థికి వైద్య విద్య అందివ్వాలనే ఉద్దేశంతో నాడు ముఖ్యమంత్రిగా జగన్ వైద్య కళాశాలలు మంజూరు చేయించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటిని ప్రైవేటుపరం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో వైసీపీ నగర అధ్యక్షుడు కె.కె.రాజు,విజయనగరం అధ్యక్షుడు మజ్జి శ్రీను, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు తప్పిపోయిన వ్యక్తి

భీమునిపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : రెండు నెలలు క్రితం ఇంటి నుంచి తప్పిపోయిన మతిస్థిమితం లేని వ్యక్తిని రెడ్‌క్రాస్ సహకారంతో పోలీసులు అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మండలంలోని చేపలుప్పాడ గ్రామానికి చెందిన పిల్ల ఆదినారాయణ (70) రెండు నెలలు క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తగరపువలస ప్రాంతంలో అనాథగా తిరుగుతున్న ఆయన్ను గత నెల 10న రెడ్ క్రాస్ సిబ్బందికి పోలీసులు అప్పగించారు. రెడ్ క్రాస్ సిబ్బంది నాటి నుంచి అతన్ని తమ వద్ద ఉంచి సపర్యలు చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాల కోసం వాకబు చేస్తూనే ఉన్నారు.ఎట్టకేలకు ఆచూకీ లభించడంతో అతని భార్య రమణమ్మ. కుమారుడికి సోమవారం భీమిలి పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

ఘనంగా దుర్గాదేవి ప్రతిమ నిమజ్జనం

భీమునిపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గొల్లవీధి శ్రీకృష్ణ జంక్షన్‌లో నిర్వహిస్తున్న దుర్గాదేవి ఉత్సవాలు సోమవారంతో ముగిసాయి. చివరి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం ప్రతిమను ఊరేగింపుగా తీసుకువెళ్లి గోస్తనీ సాగర సంగమంలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు

వాణిజ్య పన్ను బకాయిలు చెల్లించని సంస్థలు సీజ్



ఆస్తి పన్ను చెల్లించని సంస్థను సీజ్ చేస్తున్న జీవీఎంసీ అధికారులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డు డాబాగార్డెన్స్‌లో కొన్ని వాణిజ్య సంస్థలు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. ఇప్పటికే బకాయిలు చెల్లించని యజమానులకు ముందస్తుగా నోటీసులు జారీ చేసి, చట్టపరమైన చర్యల అనంతరం ఆయా సంస్థలను సోమవారం సీజ్ చేశామన్నారు. ఆస్తి పన్ను బకాయిలను వెంటనే చెల్లించి సీజ్ ఎత్తివేతకు దరఖాస్తు చేయాల్సిందిగా సంబంధిత యజమానులను జోన్-4 అధికారులకు సూచించామన్నారు. ఆస్తి పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం వహించే వారిపై ఇటువంటి కఠిన చర్యలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సన్యాసిపదల్, సీతారామయ్య, వార్డు పరిపాలన కార్యదర్శులు పాల్గొన్నారు.

29 మందికి కారుణ్య నియామకాలు

మహారాణిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాలలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసేందుకు 29 మందికి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సోమవారం పత్రాలు అందించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీశంకర్‌లతో కలసి 16 మందికి జూనియర్ అసిస్టెంట్లుగానూ, 8 మందికి టైపిస్టులుగా, ఐదుగురికి సబార్డినేట్లుగా నియమించారు. క్రమశిక్షణతో బాధ్యతగా పనిచేయాలని వారికి సూచించారు.

పోర్టు ఆవిర్భావ వేడుకలు నేడు

మాధవధార, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం అక్కయ్యపాలెం పోర్టు సీతారామ కల్యాణమండపంలో వేడుకలు నిర్వహించనున్నట్లు పోర్టు అథారిటీ, హార్బరు అండ్ పోర్ట్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు తెలిపారు. సాయంత్రం 6:30 గంటలకు గయోపాఖ్యానం (శ్రీకృష్ణార్జున యుద్ధం) పద్య నాటకం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. వేడుకల్లో పోర్టు రిటైర్డ్ ట్రాఫిక్ మేనేజరు కె.సత్యనారాయణరావు, కళాకారులు జి.అప్పలనాయుడు, రిటైర్డ్ ఫోర్‌మెన్ నూనెల అప్పారావు తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పోర్టు, డీఎల్‌బీ ఉద్యోగులు, పెన్షనర్లు, కళాకారులు, నగర వాసులు హాజరుకావాలని కోరారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించండి: జడ్సీ



అర్జీదారుని సమస్య వింటున్న జెడ్సీ బి.రాము

జ్ఞానాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము అన్నారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్సు కార్యక్రమంలో ప్రజల నుంచి 3 ఫిర్యాదులు స్వీకరించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 1, రెవెన్యూ 2 చొప్పున అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారం నిమిత్తం అందజేశారు. ఈఈలు పద్మావతి, ప్రసన్న, ఏపీడీ పుణ్యవతి, కృపానందరం, ఆర్ఓలు బాబురావు, రాజ్యలక్ష్మి, టీపీఓ ప్రవీణ్ పాల్గొన్నారు.

సీజేఐపై దాడి యత్నానికి ఏఐఎల్‌యూ ఖండన

డాబాగార్డెన్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి గవాయిపై జరిగిన దాడి ప్రయత్నం న్యాయవ్యవస్థపై, భారత రాజ్యాంగంపై దాడిగా భావించవలసి వస్తుందని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) అధ్యక్ష, కార్యదర్శులు కె.కుమార్, ఎస్.మాధవరావు వ్యాఖ్యానించారు. భారతదేశ రాజ్యాంగాన్ని, లౌకిక తత్వాన్ని వ్యతిరేకించే శక్తుల ప్రయత్నంగా చూడాల్సి వస్తుందన్నారు. రాజ్యాంగం కంటే సనాతన ధర్మమే గొప్పదని ప్రచారం చేసి ప్రజల మధ్య మతచిచ్చు పెట్టి సుప్రీంకోర్టు గౌరవానికి భంగం కలిగించే ఇటువంటి కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం పూర్తివిచారణ జరిపి, దాడి చేసిన వ్యక్తిపై, అతని వెనుక ఉన్న సంఘ వ్యతిరేక శక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ప్రజారోగ్య కేంద్రాల్లో బీపీ, షుగర్ మందుల కొరత

అక్కయ్యపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య కేంద్రాల్లో మందుల కొరత ఉంది. దీంతో ఆరోగ్య కేంద్రానికి విచ్చేసిన రోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దొండపర్తి, అక్కయ్యపాలెం విద్యుత్‌నగర్, శ్రీనివాసనగర్‌లోని ఆరోగ్య కేంద్రాల్లో రోగులు బీపీ, షుగర్ మందుల కోసం రోజుకు 100 నుంచి 150 మంది వస్తుంటారు. కానీ ఆరోగ్య కేంద్రంలో ఆ మందుల కొరత ఉండడంతో రోగులకు లభించడం లేదు. ఆరోగ్య కేంద్రంలో మందులు లేకపోతే తాము ఎక్కడ నుంచి తెచ్చుకోవాలో అర్థం కావడం లేదని రోగులు వాపోతున్నారు. ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నదీ, లేనిదీ వైద్యాధికారులు పర్యవేక్షించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య కేంద్రాలకు మందులు సరఫరా చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహించడంపై మండిపడుతున్నారు. బీపీ, షుగర్ మందులు ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇచ్చేవారని, కానీ అవి ప్రస్తుతం ఇవ్వడం లేదంటున్నారు. మందులు కావాలని ఆరోగ్య కేంద్రాలకు వెళ్తే లేవని సిబ్బంది చెప్పడంతో రోగులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. తాము మెడికల్ షాపుల్లో ఎక్కువ మొత్తం చెల్లించి మందులు కొనుగోలు చేయలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. జిల్లా వైద్యాధికారి స్పందించి ప్రజారోగ్య కేంద్రాల్లో మందులు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఓ ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ

ఈశ్వరరావు కుటుంబానికి ప్రభుత్వం అండ


▸▸ ఎంపీ శ్రీభరత్ భరోసా



బాధిత కుటుంబికులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

కంచరపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ రోజు విద్యుత్ వైరు తెగిపడడంతో మృతిచెందిన జీవీఎంసీ 55వ వార్డు గాంధీనగర్‌కు చెందిన బత్తిన ఈశ్వరరావు కుటుంబ సభ్యులను ఎంపీ శ్రీభరత్, టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జి సోమవారం పరామర్శించారు. కంచరపాలెం మెట్టు వద్ద గల ఈశ్వరరావు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం అతని కుటుంబ సభ్యులను ఓదార్చుతూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.స్థానిక గ్రామ పెద్దలు బాధిత కుటుంబ పరిస్థితిని భరత్‌కు వివరించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయంతో పాటు భరోసా కల్పిస్తామన్నారు.వార్డు టీడీపీ అధ్యక్షుడు బండి రంజీత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సునీల్ అగర్వాల్, టీడీపీ సీనియర్ నాయకులు గొర్లె అప్పారావు, జయశ్రీ, ఎన్.అప్పారావు, ఈతలపాక సుజాత, ఎస్.రమణ అప్పారావు, వెదుళ్ల పార్వతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జనసేన నాయకుల వినతి



ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు వినతిపత్రం అందిస్తున్న ఉషాకిరణ్, అప్పారావు

మురళీనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 51వ వార్డు పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందుల్ని పరిష్కరించాలని జనసేన ఉత్తర నియోజకవర్గ ఇంఛార్జి పి.ఉషాకిరణ్, 51వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు జి.అప్పారావు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధి గాంధీనగర్, అంబేడ్కర్‌కాలనీ, కళింగనగర్ ప్రాంతాల్లో యూజీడీ పనులు, రోడ్ల మరమ్మతుల కారణంగా రహదారులు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. కూటమి పార్టీల ఎమ్మెల్యేగా తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అధికారుల నివేదిక ఆధారంగా వెంటనే సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు జనసేన నాయకులు తెలిపారు.

శ్రీలహరికృష్ణ ఆధ్యాత్మిక గ్రంథావిష్కరణ



గ్రంథావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఇతర ప్రముఖులు

డాబాగార్డెన్స్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో నాలుగు దశలు ఉంటాయని, అందులో చివరిదశ సన్యాసమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. నగరంలోని కేరళ సమితి హాల్‌లో మనుజ్యోతి ఇంటర్నేషనల్ ఆధ్యాత్మికవేత్త శ్రీమన్నారాయణ శ్రీలహరికృష్ణ (అమృత మంజరి అంకురం-2) ఆధ్యాత్మిక గ్రంథాన్ని పలువురు ప్రముఖులతో కలిసి సోమవారం ఆయన ఆవిష్కరించారు. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఏయూ హిందీ మాజీ విభాగాధిపతి ఆచార్య ఎస్.ఎం.ఇక్బాల్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావులు ఆధ్యాత్మిక గ్రంథాన్ని ఆవిష్కరించారు. మనుజ్యోతి ప్రతినిధులు ఎం.సుబ్రహ్మణ్యం, బి.ప్రసాద్, బి.జీవన్ కుమార్, బి.రమేష్ పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాలకు క్లీన్ ఎనర్జీ ఆవిష్కరణలు



సీఎండీ పృథ్వీతేజ్‌కు నివేదిక అందజేస్తున్న ఈఈఎస్ఎల్ ప్రతినిధి

సిరిపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా భవిష్యత్తు తరాలకు క్లీన్ ఎనర్జీ ఆవిష్కరణలు అందించడమే లక్ష్యమని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ అన్నారు. సోమవారం కార్పొరేట్ కార్యాలయంలో అఖిలేష్ కుమార్ దీక్షిత్, సీనియర్ అధికారులతో కలసి సమావేశం నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల సేవలను మెరుగుపరచడం,స్థిరమైన ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం, భూతాపాన్ని తగ్గించడం లక్ష్యంగా ప్రపంచ స్థాయి క్లీన్ ఎనర్జీ టెక్నాలజీ అమలుకు రోడ్ మ్యాప్ రూపొందించారు. ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలులో ఈపీడీసీఎల్ అత్యుత్తమ పనితీరు కనబరిచి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఉజాల పథకం కింద రాష్ట్రంలో ఏటా 2,863 మిలియన్ కిలోవాట్స్ విద్యుత్‌ను ఆదా చేస్తున్నామన్నారు. ఫలితంగా రూ.1,145 కోట్లు ఆదా చేసినట్లు తెలిపారు. మెరుగైన సేవలు అందించే కార్యాచరణతో ముందుకెళ్తున్నట్టు చెప్పారు.

టమాటా కోసం రైతుబజార్‌లో క్యూ...



సీతమ్మధార రైతు బజార్‌లో టమాటా కోసం క్యూ కట్టిన జనం

సీతమ్మధార, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతుబజార్‌లో కూరగాయల కోసం కొనుగోలుదారులు సోమవారం పెద్ద సంఖ్యలో విచ్చేశారు. టమాటా ధర తగ్గడంతో జనం క్యూ కట్టారు. బజార్‌లో ఉదయం పూట ప్రభుత్వం సరఫరా చేసిన టమాటాలను విక్రయించారు. వీటి ధర తగ్గడంతో ప్రజలు ఎగబడి కొనుగోలు చేశారు.

కేజీహెచ్‌లో సుభోజనాన్ని పర్యవేక్షించిన ఇండో ఎంఐఎం సంస్థ ప్రతినిధి

మహారాణిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో టచ్‌స్టోన్ చారిటీ హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుభోజనం కౌంటర్‌ను ఇండో ఎంఐఎం సంస్థ ముఖ్య ఆర్థిక అధికారి బాలసుబ్రమణ్యన్ సోమవారం సందర్శించారు. ఏటా 400 మందికి సరిపడేలా సుభోజనం కోసం విరాళం అందించారు. ఈ నేపథ్యంలో రోగుల సహాయకులకు అందుతున్న భోజన పదార్థాలను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం భోజనం చేసిన వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ద్వారా రోగి సహాయకులకు చేస్తున్న సేవలను గుర్తించి తమ సంస్థ ద్వారా సహాయం అందిస్తున్నామని, ఇందుకు అవకాశం కల్పించిన హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు భక్తదాస పాల్గొన్నారు.

నేటి నుంచి తపాలా శాఖ ఆధార్ శిబిరాలు

ఎంవీపీ కాలనీ,అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ తపాలా శాఖ వారోత్సవాల సందర్భంగా ఆ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఈనెల 14 వరకూ ఆధార్ శిబిరాలు నిర్వహిస్తారు. నగరంలోని వివిధ తపాలా కార్యాలయాలు,పాఠశాలలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీ తదితర ప్రదేశాల్లో ఆధార్ బయోమెట్రిక్ అప్ డేట్ సేవలందిస్తామని సీనియర్ పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్ గజేంద్ర కుమార్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ నమోదు సేవలు ఉచితంగా లభిస్తాయని పేర్కొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి పెందుర్తి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కసిరెడ్డి అప్పలస్వామి దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్ రూపంలో దేవస్థానం ప్రజా సంబంధాల అధికారి లక్ష్మీప్రసన్నకు సోమవారం వారు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా జరిపారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

ఎంవీపీ రైతు బజారుకు రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారం

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ఉత్తమ రైతుబజారు అవార్డును ఎంవీపీ కాలనీకి అందజేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా రైతుబజారు ఎస్టేట్ అధికారి వరహాలు సర్టిఫికెట్, మెమెంటో అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ పి. సుధాకర్ కూడా పాల్గొన్నారు.

ద్వారకా బస్‌స్టేషన్‌కు జిల్లాస్థాయి అవార్డు

ద్వారకా బస్‌స్టేషన్ : నగరంలోని ద్వారకా బస్‌స్టేషన్‌కు స్వచ్ఛ బస్‌స్టేషన్ అవార్డు లభించింది. సోమవారం ఉడా ఆడిటోరియంలో స్వచ్ఛాంధ్ర అవార్డు కార్యక్రమంలో ఏడాది పాటు నిర్వహించిన స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగంగా ఈ బస్ స్టేషన్ అవార్డు సొంతం చేసుకుంది. ఈమేరకు ఆర్ఎం అప్పలనాయుడు ఎంపీ శ్రీభరత్, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు ఎమ్మెల్యేలు విష్ణు కుమార్‌రాజు, వంశీకృష్ణ, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అలాగే పాఠశాలల విభాగంలో భీమిలి కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగకుమారి, పంచాయతీల విభాగంలో టి. నగరపాలెం పంచాయతీ సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి అవార్డులు అందుకున్నారు.



సీఎం చంద్రబాబు చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న ఎంవీపీ బజారు ఈఓ వరహాలు







కలెక్టర్ చేతుల మీదుగా స్వచ్ఛ అవార్డులు అందుకుంటున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, భీమిలి మండలం టి. నగరంపాలెం సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి, భీమిలిలోని గొల్లలపాలెం కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగాకుమారి (ఎడమ నుంచి కుడి వైపు)

యుద్ధప్రతిపాదికన కూలిన చెట్ల తొలగింపు

డాబాగార్డెన్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో ఇటీవల నగరంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని డాబాగార్డెన్స్ లలితాకాలనీ, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కాలనీ, డాబాగార్డెన్స్ అంబేడ్కర్ బస్టాప్ ప్రాంతాల్లో అధికారులు కూలిన చెట్ల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరం పొక్లయిన్‌లు ఉపయోగించి చెట్లను తొలగించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.కామేశ్వరరెడ్డి తెలియజేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులకు తలెత్తకుండా ఈ ప్రక్రియను జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశాల మేరకు తొలగింపుల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం సాధారణ పరిస్థితి ఉన్నట్లు పేర్కొన్నారు.

నవజాత శిశువులకు రక్ష

... 3వ పేజీ తరువాయి

ఉత్పన్నమవుతున్నాయని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నలుగురు వైద్యులను కేటాయించాలని అధికారులు కోరుతున్నారు.

నాణ్యమైన వైద్య సేవలతో కోలుకునేలా

నవజాత శిశువుల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు ప్రత్యేకంగా ఎస్ఎన్‌యూసీ ఉంది. ఇక్కడ 20 వార్మర్స్‌తో సేవలు అందిస్తున్నాం. చిన్నపిల్లల వైద్య నిపుణులు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పూర్తిస్థాయి చిన్న పిల్లల వైద్య నిపుణులను కేటాయిస్తే మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. ప్రతిరోజూ కనీసం 10 నుంచి 15 మంది చిన్నారులు నవజాత శిశువుల సంరక్షణ కేంద్రంలో ఉంటున్నారు. పిల్లలు పూర్తిగా కోలుకున్న తరువాత వ్యాక్సినేషన్ చేయించి డిశ్చార్జ్ చేస్తున్నాం.

-డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, చిన్నపిల్లల వైద్య నిపుణులు, ఘోష ఆస్పత్రి

గూడుపురాణి

... 3వ పేజీ తరువాయి

ఖాతాలకు సొమ్ములు జమ కావాలి. ప్రతి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన తరువాతే అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేయాలి. కానీ కాంట్రాక్టర్లతో కొందరు అధికారులు మిలాఖత్ కావడంతో త్రైపాక్షిక ఒప్పందం అమలు జరగడం లేదు. ఇళ్లకు ద్వారాలు ఏర్పాటుచేసి, తలుపులు బిగించలేదు. కిటికీలు లేవు. ఇంటిలోపలకు వెళ్లేందుకు ముందున మెట్లు కట్టలేదు. లోపల ఎలక్ట్రికల్ కన్‌సీలింగ్ చేయలేదు. అయినా కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసేశారు. ప్రధానంగా వేల సంఖ్యలో ఇళ్లు నిర్మించే కాంట్రాక్టర్లు ఎక్కువ ఉల్లంఘనలకు పాల్పడ్డారు. వీరికి ఉన్నత స్థాయిలో పలుకుబడి ఉండడంతో అధికారులు కనీసం ప్రశ్నించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన కాంట్రాక్టర్లు ఇప్పుడు కూడా పెత్తనం చెలాయిస్తున్నారు. మొత్తం బిల్లు డ్రా చేసేసి నిర్మాణ బాధ్యతల నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తలుపులు, కిటికీలు బిగించకపోవడం వల్ల ఒక్కో ఇంటికి కనీసం పది వేలు మిగులుతుంది. అయినా అధికారులు మాట్లాడడం లేదు. కొందరు అధికారులు అందినకాడికి దండుకున్నారు. అయితే ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఇటీవల జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సమీక్షించినపుడు, తలుపులు, కిటికీలు, కన్‌సీలింగ్‌పై ప్రశ్నించడంతో అధికారులు కంగారుపడ్డారు. ప్రతి ఇంటికి తలుపు బిగించాల్సిందేనని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లను ఒప్పించి తలుపులు, కిటికీలు బిగించేలా అధికారులు ఏమి చేస్తారో చూడాలి.

కంచరపాలెంలో దోపిడీ

... 3వ పేజీ తరువాయి

నోటికి, చేతులకు ప్లాస్టిక్ టేపు వేసి బంధించారు. అతని చేతికి ఉన్న డైమండ్ రింగ్‌ను లాక్కొన్నారు. అనంతరం బెడ్‌రూమ్‌లోని టీవీ స్టాండ్‌పై ఉన్న కారు తాళాలను తీసుకుని కిందకు వెళ్లిపోయారు. ఇంటి ముందు పార్కు చేసి ఉన్న కారుతో దుండగులు వుడాయించారు. దీనిపై యల్లయ్యమ్మ సోమవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదుచేసి దర్యాప్తు నిమిత్తం క్రైమ్ పోలీసులకు బదిలీ చేశారు. దుండగులు ముఖానికి మాస్కులు, చేతికి గ్లౌజ్‌లు వేసుకున్నారని, జీన్‌ప్యాంట్లు ధరించి ఉన్నారని, హిందీలో మాట్లాడారని యల్లయ్యమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిని బట్టి బిహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఠా పని అయి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు.

మారికవలస వద్ద కారును వదిలేసిన దుండగులు

ఆనంద్‌కుమార్‌రెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగులు అతని కారుని మారికవలస వద్ద వదిలేసి అక్కడి నుంచి వేరొక వాహనంలో పరారైపోయారు. ఘటనా స్థలంతోపాటు చుట్టుపక్కల సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దుండగులు రాత్రి 12.30 గంటల సమయంలో ఒక కారులో జాతీయ రహదారిపై దిగి అక్కడి నుంచి రోడ్డు దాటి ఆనంద్‌కుమార్‌రెడ్డి ఇంటి వైపు వచ్చినట్టు గుర్తించారు. ఎయిర్‌పోర్టు లేదంటే రైల్వేస్టేషన్ నుంచి ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి యాప్‌ల ద్వారా కారును బుక్ చేసుకుని అక్కడికి వచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు. చోరీకి పాల్పడిన తర్వాత ఆనంద్‌కుమార్‌రెడ్డి కారులో ఎన్ఏడీ, సింహాచలం మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డులో వెళ్లినట్టు గుర్తించారు. పెదగదిలి జంక్షన్ వద్ద కారును ఆపి ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడి తర్వాత హనుమంతవాక మీదుగా మారికవలస వైపు వెళ్లినట్టు గుర్తించారు. అక్కడ కారును రోడ్డుపక్కన ఆపి మరో వాహనంలో శ్రీకాకుళం వైపు వెళ్లిపోయినట్టు పోలీసులు భావిస్తున్నారు. చోరీకి పాల్పడింది అంతర్ రాష్ట్రముఠా అయితే వారికి ఆనంద్‌కుమార్‌రెడ్డి ఇంట్లో లేరని, కింది పోర్షన్‌లో వృద్ధురాలు, ఆమె మనుమడు మాత్రమే ఉంటారని ఎలా తెలుస్తుందని పోలీసులు అనుమానిస్తున్నారు. జాతీయ రహదారిపై కారుదిగిన దుండగులు ఎలాంటి తడబాటు లేకుండా నేరుగా ఆనంద్‌కుమార్‌రెడ్డి ఇంటికే వెళ్లడం బట్టి చూస్తే స్థానికుల సహకారం ఏమైనా ఉందా?...అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు.

అంబుజాతో కాలుష్యం ముప్పు

... 3వ పేజీ తరువాయి

పరిహారం ఇవ్వలేదు. స్థానిక నిర్వాసిత మత్స్యకారులు ఎవరూ పోర్టులో పనికి రాకుండా జాగ్రత్తలు తీసుకుంది. భూములు ఇచ్చిన వారి పట్ల ఏమాత్రం కనికరం చూపించలేదు.

రోజూ 4 వేల టన్నుల ఫ్లైయాష్ రవాణా

పెదగంట్యాడకు అత్యంత సమీపాన అంటే సుమారుగా 130 మీటర్ల దూరంలో అంబుజా సిమెంట్ కంపెనీ నూతన యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి అదానీ సంస్థ (అంబుజా సిమెంట్స్‌ను ఏడాది క్రితం అదానీ టేకోవర్ చేసింది) ఏర్పాట్లు చేస్తోంది. ఏడాదికి 40 లక్షల టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. దీని కోసం సమీపంలోని ఎన్‌టీపీసీ, హిందూజా థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి ఫ్లైయాష్‌ను రోజుకు నాలుగువేల టన్నులు తీసుకుంటామని చెబుతోంది. అంటే ఫ్లైయాష్ లారీలు నివాస ప్రాంతాల మీదుగా దాదాపుగా 14 కి.మీ ప్రయాణం చేస్తాయి. వాటి కాలుష్యం అంతా అక్కడి ప్రజలపైనే పడుతుంది. ఈ ఫ్లైయాష్‌లో విషపూరితమైన మెర్క్యురీ, సీసం, యురేనియం, థోరియం వంటి రేడియో ఐసోటోపులతో పాటు కాడ్మియం, ఆర్సెనిక్, జింక్ వంటి లోహాలు కూడా ఉంటాయని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ ఫ్లైయాష్ వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు వస్తాయని చెబుతున్నారు.


నీటికీ కష్టాలే

సిమెంట్ తయారీకి నీరు అవసరం ఎక్కువ. రోజుకు 4 వేల కిలోలీటర్లు కావాలి. ఈ పరిశ్రమకు అవసరమైన నీటిని అందించే సామర్థ్యం ప్రస్తుతం జీవీఎంసీకి లేదు. భూగర్భ జలాలు ఉపయోగించకూడదనే నిబంధన ఉంది. అందుకని అదానీ యాజమాన్యం తప్పుడు నివేదిక సమర్పించింది. గాజువాకలో మురుగునీటి శుద్ధి కేంద్రం నుంచి రోజుకు 400 కిలో లీటర్లు తీసుకుంటామని నివేదికలో పేర్కొంది. వాస్తవానికి గాజువాకలో ఆ కేంద్రమే లేదు. అది జీవీఎంసీ వద్ద ప్రతిపాదన దశలోనే ఉంది. దానిని నివేదికలో చూపించి, అక్కడి నుంచి నీటిని తీసుకుంటామని ప్రభుత్వ అనుమతులు కోరుతోంది. మిగిలిన నీటిని అంటే రోజుకు 3,600 కిలోలీటర్లు ఏలేరు కాలువ నుంచి తీసుకుంటుంది. దానివల్ల స్థానిక ప్రజలకు తాగునీటి సమస్యలు ఎదురవుతాయి. ఇవేవీ పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో పొందుపరచకపోవడం గమనార్హం.

గ్రామీణ అభివృద్ధికి తోడ్పాటు

ఈ సిమెంట్ పరిశ్రమ వల్ల గ్రామీణాభివృద్ధి జరుగుతుందని అదానీ యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. పెదగంట్యాడ, పరిసర ప్రాంతాల ప్రజలకు జీవనాధార అవకాశాలు మెరుగుపడతాయని తెలిపింది.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శివలింగం

అగనంపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెద మడకలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని రుద్రాభిషేకాలు జరిపారు. నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం, భక్తిగీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్వహణకు విరాళం



విరాళం అందజేస్తున్న రామఅప్పారావు

అగనంపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్వహణ కోసం సమాచార హక్కు చట్టం ఉద్యమ కర్త పట్టా రామఅప్పారావు రూ. 25 వేలు విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు రామఅప్పారావును ఘనంగా సత్కరించారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి, ప్రతినిధులు మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, సాయిబ్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 13 వినతులు

గాజువాక, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 13 వినతులు అందాయి. జోనల్ పరిధిలో రోడ్లకు మరమ్మతు చేపట్టాలని, వీధి లైట్లు వేయాలని, కుక్కల బెడద నివారించాలని కోరుతూ ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు వినతి పత్రాలందజేశారు. ఫుట్‌పాత్‌లపై దుకాణాలు తొలగించాలని కోరారు. జోనల్ కమిషనర్ శేషాద్రి వినతులు స్వీకరించారు.

8 ఫిర్యాదులు..

వేపగుంట:వేపగుంట జోనల్ కార్యాలయంలో 8 ఫిర్యాదులు అందాయి. కృష్ణానగర్‌లో అక్రమనిర్మాణంను నిలుపు చేయాలని, చింతలగ్రహారం ప్రాంతంలో రహదారి విస్తరణను 80 అడుగులకు కుదించాలని, చినముషిడి వాడ ఏరియాలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం, 98వ వార్డు ఏరియాలో భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వవద్దని తదితర ఫిర్యాదులు అందాయి. పరిష్కార చర్యలు చేపడతామని జెడ్సీ హెచ్. శంకర్రావు తెలిపారు.

సినిమా గైడ్

- **కాంతార2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఘాటీ** : ముక్తాస్, (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 20, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 62, దొండకాయలు 44, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 74, కీరదోస 32, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 32, కంద 36, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 34, కూరపెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిదగుమ్మడికాయ 20, కర్రపెండలం 24, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు

» ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. శ్రీహరిపురం ప్రాంతంలో జీఎస్టీ పై సోమవారం ఉదయం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీఎస్టీ తగ్గించడం గొప్ప నిర్ణయమన్నారు. గతంలో జీఎస్టీ వలన అనేక వర్గాలు వివిధ రకాల కొనుగోలుపై భారం పడేందని, ఇప్పుడు తగ్గింపులో ఉపశమనం లభించినట్లయిందన్నారు. ఈ సందర్భంగా వ్యాపారులకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెందుర్తి: గ్రేటర్ 96వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు పెంటకోట రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం జీఎస్టీ తగ్గింపుపై ప్రచారం నిర్వహించారు. పలువురు



అవగాహన కల్పిస్తున్న వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తదితరులు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

వ్యాపారుల వద్దకు వెళ్లి జీఎస్టీపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ముందుగా పాత పెందుర్తి రామాలయం వద్ద కరపత్రాలను మహిళలకు అందజేశారు. సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్ ఆదా ఎలా చేసుకోవచ్చో వివరించారు. టీడీపీ నేత పీలా జితేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఏడీ జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం రామాలయం వీధి, గవరవీధిల్లో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సులు సోమవారం నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బొమ్మిడిరమణ ఇంటింటికి తిరిగి జీఎస్టీతో కలిగే ప్రయోజనాల కరపత్రాలకు పంచిపెట్టారు. కూటమి ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుదల తదితర అంశాలనువివరించారు. ఈ కార్యక్రమంలో సీఓ నాయుడు, టీడీపీ నాయకుడు నరవ పైడిరాజు, పి.సతీశ్ జ్యోతి, వెంకటలక్ష్మి, ప్రసాద్ స్థానిక కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతకు అభినందన

ఎన్ఏడీ జంక్షన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల థాయిలాండ్‌లో జరిగిన వరల్డ్ సీనియర్ ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలో గెలుపొందిన విశాఖ నగరవాసి బీవీఎస్‌కే లింగేశ్వరరావుని డీసీసీబీ చైర్‌పర్సన్ ఇన్‌చార్జి కోనతాతారావు అభినందించారు. మర్రిపాలెం ఉడాలేవుట్‌లో ఉన్న డీసీసీబీ కార్యాలయంలో సోమవారం మాజీ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి అయిన లింగేశ్వరరావు తాతారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో విశాఖ నగర ఖ్యాతిని ఇనుమడించిన ఆయనను ప్రత్యేకంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.



ప్రపంచ స్థాయిలో గెలుపొందిన లింగేశ్వరావు అభినందనలు తెలుపుతున్న కోన తాతారావు

జగన్ పర్యటనను విజయవంతం చేయాలి: అమర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

మద్దిలపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9న జగన్ నర్సీపట్నం వైద్య కళాశాల సందర్శనకు వస్తున్నారని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. ప్రతీ పేద విద్యార్థికి వైద్య విద్య అందివ్వాలనే ఉద్దేశంతో నాడు ముఖ్యమంత్రిగా జగన్ వైద్య కళాశాలలు మంజూరు చేయించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటిని ప్రైవేటుపరం చేస్తోందని విమర్శించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 9న జగన్ నర్సీపట్నం వైద్య కళాశాల వద్ద నిరసన తెలుపుతారన్నారు. కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేస్తోందని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్రం ముందుకుసాగుతున్నా అడ్డుకోవడం లేదని అమర్‌నాథ్ ఆరోపించా రు. నగరంలో చిరువర్తకుల బతుకుతెరువును ధ్వంసం చేసి రోడ్డున పడేసిందన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నగర అధ్యక్షుడు కెకె.రాజు, విజయనగరం అధ్యక్షుడు మజ్జి శ్రీను, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పాల్గొన్నారు.

'సిమెంట్ కంపెనీతో జన జీవనం అస్తవ్యస్తం'



కంచాల మోతతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మల్కాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అదానీ సిమెంట్ కంపెనీ నిర్మాణం పనులను వెంటనే నిలుపు చేయాలని సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పైడిరాజుడిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ఆటోలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదగంట్యాడ ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో భూగర్భజలాలలు నాశనమవుతాయని, దుమ్ము, ధూళి వ్యాపించి పరిసరాల్లో జనాలు జీవించనలేని పరిస్థితి నెలకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫ్యాక్టరీపై ఈనెల 8వ తేదీన చేపట్టనున్న ప్రజాభియసేకరణలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని వ్యతిరేకించాలని ఆయన కోరారు. పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఏడువార్డులు, షిప్‌యార్డు, హెచ్‌పీసీఎల్ గేటు, వీడీఆర్, శరత్ చటర్జీ, బోత్ర గోడౌన్స్‌లలో విస్తృతంగా ప్రచారం చేశారు. అలాగే సాయంత్రం నెహ్రూనగర్ ప్రాంతంలో కంచాలు మోగించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటారావు, సత్యారావు, ఎస్.శ్రీనివాసరావు, బూడి శ్రీను, దున్న రాజేశ్, రామకృష్ణ, శ్రీను, ప్రశాంత్, గంగాధర్, ఎస్‌కే సుభాశ్, కుమార్. జె. రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోను తరలించొద్దు: ఎన్ఎంయూ



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఎన్ఎంయూ కార్మికులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపో తరలింపు ప్రక్రియను తక్షణమే నిలుపు చేయాలని కోరుతూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 39వ రోజుకుచేరాయి. ఈ సందర్భంగా ఎన్ఎంయూ స్టీల్‌సిటీ డిపో అధ్యక్షులు జి.రామకృష్ణ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యంతో 33 ఏళ్ల పాటు స్టీలు సిటీ డిపో లీజు ముగుస్తున్న నేపథ్యంలో ఇటీవల ఆర్టీసీ యాజమాన్యానికి ఉక్కు యాజమాన్యం నోటీసులు జారీ చేసిందన్నారు. ప్రస్తుత భూమి విలువ ఆధారంగా లీజు చెల్లించాలని, వడ్డీలేని సెక్యూరిటీ డిపాజిట్, సేవా ఛార్జీల రూపేణా కోట్లాది రూపాయలు చెల్లించాలని కోరటం తగదన్నారు. గతంలో నిర్దేశించిన లీజును పొడిగించి సహకరించాలని కోరారు. ఈ దీక్షలలో డీఏ రావు, పీఆర్ రావు, వైఏ రాజు, ఎం.రమేశ్ కూర్చొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ కార్మికులు పాల్గొన్నారు.

ఆందోళనలో నిర్వాసిత కాంట్రాక్టు కార్మికుల భవిష్యత్తు

» 500 మంది తొలగింపు

» న్యాయం కోసం ఉద్యమ కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన నిర్వాసిత కాంట్రాక్టు కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ప్లాంట్‌లో ఇటీవల వేల సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులను తొలగించిన విషయం తెలిసిందే. వీరిలో సుమారు 500 మంది నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. ప్లాంట్ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సింది పోయి ఇప్పటికే పని చేస్తున్న కార్మికులను తొలగించటంతో నిర్వాసితులు భారీ ఎత్తున ఉద్యమాలు చేపడుతున్నారు.



విశాఖ స్టీల్ ప్లాంట్ వ్యూ

నిర్వాసితులను తొలగించేలేదని ఉక్కు యాజమాన్యం అప్పట్లో కార్మిక నాయకులకు హామీ ఇచ్చినా, అవేవీ పట్టించుకోకుండా యాజమాన్యం మాత్రం తమ పని తాము చేసుకుంటూపోయింది. దీంతో సుమారు 500 మంది నిర్వాసితులు కుటుంబాలతో రోడ్డున పడ్డారు. ఈ స్థితిలో నిర్వాసిత సంఘం నాయకులు ఓ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. జిల్లాలోని ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందజేత, ముఖ్యమంత్రి, ఉప ఉపముఖ్యమంత్రులను కలిసి సమస్యను విన్నవించటం, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట ఆందోళనకు నిర్ణయించినట్టు నిర్వాసిత నాయకులు తెలిపారు.

కార్మికుల తొలగింపు అన్యాయం




ఎన్నో ఏళ్లగా విధులునిర్వహిస్తున్న నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం తొలగించటం అన్యాయం. దీనిపై తాము ఆందోళనలు చేపడుతున్నాం. అయినా, యాజమాన్యం ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను తీసుకువచ్చి ఇక్కడ పనులు చేయిస్తోంది. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు ఎంతటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నాం.

- కె.వంశీకృష్ణ, ఉక్కు నిర్వాసిత నాయకుడు

భవిష్యత్తు తరాలకు క్లీన్ ఎనర్జీ ఆవిష్కరణలు

» ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సిరిపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా భవిష్యత్తు తరాలకు క్లీన్ ఎనర్జీ ఆవిష్కరణలు అందించడమే లక్ష్యమని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ అన్నారు. సోమవారం కార్పొరేట్ కార్యాలయంలో అఖిలేష్ కుమార్ దీక్షిత్, సీనియర్ అధికారులతో కలసి సమావేశం నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల సేవలను మెరుగుపరచడం, స్థిరమైన ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం, భూతాపాన్ని తగ్గించడం లక్ష్యంగా ప్రపంచ స్థాయి క్లీన్ ఎనర్జీ టెక్నాలజీ అమలుకు రోడ్ మ్యాప్ రూపొందించారు. ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలులో దేశంలోనే ఈపీడీసీఎల్ అత్యుత్తమ పనితీరు కనబరిచి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఉజాలపథకం కింద రాష్ట్రంలో ఏటా 2,863 మిలియన్ కిలోవాట్స్ విద్యుత్‌ను ఆదాచేస్తున్నామన్నారు. ఫలితంగా రూ.1,145 కోట్లు ఆదా చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో మెరుగైన సేవలందించేలా తగిన కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు.



సీఎండీ పృథ్వీతేజ్‌కు నివేదిక అందజేస్తున్న ఈఈఎస్ఎల్ ప్రతినిధులు

ప్రభుత్వ భూమి స్వాధీనం

గోపాలపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్లపువానిపాలెం గ్రామం లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో మండల రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను సోమవారం ఏర్పాటు చేశారు. గ్రామంలోని వైఎస్సార్ కాలనీలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది చర్యలు చేపట్టారు. కాలనీలోని సర్వే నంబర్ 124/3డీ2, 122/1లో ఆర్ఐ కె.కోమలి ఆధ్వర్యంలో సోమవారం సర్వే చేపట్టారు. 124/3డీ2లో 376 చదరపుగజాల యూఎల్‌సీ భూమి, సర్వే నంబర్ 122/1లో 394లో గజాల ప్రభుత్వ భూమి (గెడ్డ) స్థలం ఆక్రమణకు గురైనట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.



ఎల్లపువానిపాలెం వైఎస్సార్ నగర్‌లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

తిరుమలనగర్‌కు 'స్వచ్ఛ ఆంధ్ర'అవార్డు



అవార్డు అందుకుంటున్న కాలనీ ప్రతినిధులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వవార్డు తిరుమలనగర్ కాలనీకి స్వచ్ఛ ఆంధ్రా అవార్డు- 2025 లభించింది. సోమవారం ఉడా ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రాజు, ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, వంశీకృష్ణ, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని తిరుమల నగర్ కాలనీ ప్రతినిధులు వసంత రెడ్డి, సత్యనారాయణ, రాము, రాజు, జీవానందం అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపునకు వందలాది ఇంకుడు గుంతలు తవ్వకం, ప్లాస్టిక్ నివారణకు ర్యాలీలు, అవగాహన సదస్సులు, మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్, శ్రమదానాలు, తదితర అంశాల్లో చేస్తున్న కృషికి ఈ అవార్డు లభించినట్టు తెలిపారు.

అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రికి..

అగనంపూడి: అగనంపూడి ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర అవార్డు లభించింది. ఈ మేరకు సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్‌నుంచి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ అవార్డును అందుకున్నారు. పచ్చదనం, తడి, పోడి చెత్త సేకరణ, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలతో ఈ వార్డుకు ఎంపికనైనట్టు సూపరింటెండెంట్ గోపీకృష్ణ తెలిపారు.

ద్వారకా బస్ స్టేషన్‌కు..

ద్వారకా బస్ స్టేషన్: విశాఖనగరంలో ద్వారకా బస్ స్టేషన్‌కు స్వచ్ఛ అవార్డు లభించింది. ఏడాదిగా నిర్వహించిన స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగంగా బస్ స్టేషన్‌కు ఈ అవార్డు వచ్చినట్టు ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు తెలిపారు.



కలెక్టర్‌నుంచి అవార్డు తీసుకుంటున్న సూపరింటెండెంట్ గోపీకృష్ణ



ఆర్టీసీ ఆర్ఎం అప్పల నాయుడు

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో పనిచేయని కోచ్ ఇండికేటర్లు

» ప్రయాణికులకు ఇబ్బందులు



దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్‌లో కోచ్ ఇండికేటర్లు పనిచేయక పోవడంతో ప్రయాణికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ స్టేషన్ మీదుగా 48 జతల రైళ్లు వెళ్తుంటాయి. అయితే, దసరా సెలవులు ముగియటంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. 1,4 ప్లాట్ ఫారాల్లో కోచ్ ఇండికేటర్లు పనిచేయక పోవటంతో రైళ్ల 2 నిమిషాల హాల్టుతో లగేజీలు, పిల్లా పాపలు, వృద్ధులతో పరుగులు తీయాల్సి వస్తోంది. ఏ కోచ్ ఎక్కడ ఆగుతుందో తెలియక గందరగోళానికి గురవుతున్నారు. గత 5 రోజులుగా ఇదేపరిస్థితి నెలకొంది. సంబంధిత రైల్వే ఉన్నతాధికారులు స్పందించి కోచ్ ఇండికేటర్లను తక్షణమే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

నేటి నుంచి పైడితల్లి ఉత్సవాలు



70 వార్డులో ముస్తాబయిన అమ్మవారి ఆలయం

ఆటోనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70 వార్డు శ్రీనివాసనగర్, ఎర్రగడ్డ కాలనీ, శ్రామిక నగర్ గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లి పండగ మంగళవారం నుంచి ఈ నెల 14 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు బండారు సత్యారావు, బొడ్డేడ రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా మామిడి తోరణాలు, అరటి చెట్లు, విద్యుద్దీపాలతో అలంకరించారు. సోమవారం అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మోహన్ కృష్ణ, ఆదారి రామకృష్ణ, కోటేశ్వరరావు, కర్రి రమణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల బోధనకు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ వి. సురేఖ తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ 55 శాతం మార్కులు, నెట్ లేదా సెట్ లేదా పీహెచ్‌డీ అర్హత కలిగి ఉండాలని చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 10న ఉదయం 11కు కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 8179780917, 9848632130 సెల్‌నంబర్లను సంప్రదించాలని ఆమె సూచిం చారు.

కాసులు ఇస్తేనే.. క్రమబద్ధీకరణ

» పట్టా కన్వెయిన్స్ డీడ్ రిజిస్ట్రేషన్ డీడ్‌లో దందా

» లబోదిబోమంటున్న లబ్ధిదారులు

పెందుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు క్రమబద్ధీకరణ రెవెన్యూ శాఖలో కిందస్థాయి ఉద్యోగులకు కలిసివస్తోంది. కాసులు ఇస్తేనే క్రమబద్ధీకరిస్తామంటూ సొమ్ము చేసుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2014-19లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ స్థలాలు 100 గజాల మేర ఆక్రమణలను క్రమబద్ధీకరించింది. 296 జీవో ప్రకారం కూటమి ప్రభుత్వం మళ్లీ క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. దీంతో పెందుర్తి రెవెన్యూ పరిధిలో 2,197 ప్రభుత్వ స్థలాలు క్రమబద్ధీకరణ పట్టాలు పొందిన 2,927 మంది రిజిస్ట్రేషన్లు నిర్వహించే ప్రక్రియ గత నెలలో చేపట్టారు. ప్రతి పట్టాకు డాక్యుమెంట్ ఇవ్వనున్నారు. ఇందుకోసం ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన పట్టాదారులు కన్వెయన్స్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ రుసుం, స్టాంపు పేపరుతో కలిపి రూ. 510 మాత్రమే చెల్లించాలి. పట్టాలు కన్వేయన్స్ డీడ్స్ కోసం రెవెన్యూ నియమించిన కొంతమంది సచివాలయ ప్రత్యేక వీఆర్వోలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. సొమ్ము ఇవ్వకపోతే అభ్యంతరాలు, సాకులు చెప్పి పట్టా రిజిస్ట్రేషన్లకు అడ్డంకి పెడుతున్నట్టు కొంతమంది ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ వద్ద తీవ్ర జాప్యం, డాక్యుమెంట్ ఇచ్చి ఒరిజనల్ పట్టా ఇవ్వపోవడం వంటివి చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో దళారులు ద్వారా పట్టాదారుల నుంచి రూ. 1500 నుంచి రూ. 3 వేల వరకు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. ఇలా వసూలు చేయడంతో పెందుర్తిలోని ఓ సచివాలయంలో పట్టాదారులు కొంత మందిని నిలదీయడంతో వివాదం చోటు చేసుకుంది. ఈ అక్రమ వసూళ్లపై పలువురు స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్నారు.



పెందుర్తి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో లబ్ధిదారులు (పాత చిత్రం)


డబ్బు అడిగితే ఫిర్యాదు చేయాలి: తహశీల్దార్

ఈ విషయంపై తహసీల్దార్ వెంకట అప్పారావు వద్ద ప్రస్తావించగా, పట్టా కన్వెయిన్స్ డీడ్ రిజిస్ట్రేషన్ డీడ్‌లో వసూళ్లకు పాల్పడితే నేరుగా తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు.









ఆందోళనలో నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులు

- 500 మంది తొలగింపు
- న్యాయం కోసం ఉద్యమ కార్యాచరణ

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన నిర్వాసిత కాంట్రాక్టు కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ప్లాంట్‌లో ఇటీవల వేల సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులను తొలగించిన విషయం తెలిసిందే. వీరిలో సు మారు 500 మంది నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. ప్లాంట్ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సింది పోయి ఇప్పటికే పని చేస్తున్న కార్మికులను తొలగించటంతో నిర్వాసితులు భారీ ఎత్తున ఉద్యమాలు చేపడుతున్నారు. నిర్వాసితులను తొలగించమని ఉక్కు యాజమాన్యం అప్పట్లో కా ర్మిక నాయకులకు హామీ ఇచ్చినా, అవేవీ పట్టించుకోకుండా యాజమాన్యం మాత్రం తమ పని తాము చేసుకుంటూపోయింది. దీంతో సుమారు 500 మంది నిర్వాసితులు కుటుంబాలతో రోడ్డున పడ్డారు. ఈ స్థితిలో నిర్వాసిత సంఘం నాయకులు ఓ ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. జిల్లాలోని ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందజేత, ముఖ్యమంత్రి, ఉప ఉపముఖ్యమంత్రులను కలిసి సమస్యను విన్నవించటం, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట ఆందోళనకు నిర్ణయించినట్టు నిర్వాసిత నాయకులు తెలిపారు.


విశాఖ స్టీల్‌ప్లాంట్ వ్యూ

కార్మికుల తొలగింపు అన్యాయం



ఎన్నో ఏళ్లగా విధులునిర్వహిస్తున్న నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం తొలగించటం అన్యాయం. దీనిపై తాము ఆందోళనలు చేపడుతున్నాం. అయినా, యాజమాన్యం ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను తీసుకువచ్చి ఇక్కడ పనులు చేయిస్తోంది. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు ఎంతటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నాం.

- కె.వంశీకృష్ణ, ఉక్కు నిర్వాసిత నాయకుడు

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో పనిచేయని కోచ్ ఇండికేటర్లు

- ప్రయాణికులకు ఇబ్బందులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్‌లో కోచ్ ఇండికేటర్లు పనిచేయక పోవడంతో ప్రయాణికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ స్టేషన్ మీదుగా 48 జతలు రైళ్లు వెళ్తుంటాయి. అయితే, దసరా సెలవులు ముగియటంతో ప్రయాణీకుల రద్దీ పెరిగింది. 1,4 ప్లాట్‌ఫారాల్లో కోచ్ ఇండికేటర్లు పని చేయక పోవటంతో రైళ్ల 2 నిమిషాల హాల్టుతో లగేజీలు, పిల్లా పాపలు, వృద్ధులతో పరుగులు తీయాల్సి వస్తోంది.

ఏ కోచ్ ఎక్కడ ఆగుతుందో తెలియక అవస్థలకు గురవుతున్నారు. గత 5 రోజులు గా ఇదేపరిస్థితి నెలకొం ది. సంబంధిత రైల్వే ఉన్నత అధికారులు స్పం దించి కోచ్ ఇండికేటర్లను తక్షణమే మరమ్మతులు చేయించాలనిప్రయాణికులు కోరుతున్నారు.

అంబుజాతో కాలుష్యం ముప్పు

... 3వ పేజీ తరువాయి

పరిహారం ఇవ్వలేదు. స్థానిక నిర్వాసిత మత్స్యకారులు ఎవరూ పోర్టులో పనికి రాకుండా జాగ్రత్తలు తీసుకుంది. భూములు ఇచ్చిన వారి పట్ల ఏమాత్రం కనికరం చూపించలేదు.

రోజూ 4 వేల టన్నుల ఫ్లైయాష్ రవాణా

పెదగంట్యాడకు అత్యంత సమీపాన అంటే సుమారుగా 130 మీటర్ల దూరంలో అంబుజా సిమెంట్ కంపెనీ నూతన యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి అదానీ సంస్థ (అంబుజా సిమెంట్స్‌ను ఏడాది క్రితం అదానీ టేకోవర్ చేసింది) ఏర్పాట్లు చేస్తోంది. ఏడాదికి 40 లక్షల టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. దీని కోసం సమీపంలోని ఎన్‌టీపీసీ, హిందూజా థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి ఫ్లైయాష్‌ను రోజుకు నాలుగువేల టన్నులు తీసుకుంటామని చెబుతోంది. అంటే ఫ్లైయాష్ లారీలు నివాస ప్రాంతాల మీదుగా దాదాపుగా 14 కి.మీ ప్రయాణం చేస్తాయి. వాటి కాలుష్యం అంతా అక్కడి ప్రజలపైనే పడుతుంది. ఈ ఫ్లైయాష్‌లో విషపూరితమైన మెర్క్యురీ, సీసం, యురేనియం, థోరియం వంటి రేడియో ఐసోటోపులతో పాటు కాడ్మియం, ఆర్సెనిక్, జింక్ వంటి లోహాలు కూడా ఉంటాయని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ ఫ్లైయాష్ వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు వస్తాయని చెబుతున్నారు.

నీటికీ కష్టాలే

సిమెంట్ తయారీకి నీరు అవసరం ఎక్కువ. రోజుకు 4 వేల కిలోలీటర్లు కావాలి. ఈ పరిశ్రమకు అవసరమైన నీటిని అందించే సామర్థ్యం ప్రస్తుతం జీవీఎంసీకి లేదు. భూగర్భ జలాలు ఉపయోగించకూడదనే నిబంధన ఉంది. అందుకని అదానీ యాజమాన్యం తప్పుడు నివేదిక సమర్పించింది. గాజువాకలో మురుగునీటి శుద్ధి కేంద్రం నుంచి రోజుకు 400 కిలో లీటర్లు తీసుకుంటామని నివేదికలో పేర్కొంది. వాస్తవానికి గాజువాకలో ఆ కేంద్రమే లేదు. అది జీవీఎంసీ వద్ద ప్రతిపాదన దశలోనే ఉంది. దానిని నివేదికలో చూపించి, అక్కడి నుంచి నీటిని తీసుకుంటామని ప్రభుత్వ అనుమతులు కోరుతోంది. మిగిలిన నీటిని అంటే రోజుకు 3,600 కిలోలీటర్లు ఏలేరు కాలువ నుంచి తీసుకుంటుంది. దానివల్ల స్థానిక ప్రజలకు తాగునీటి సమస్యలు ఎదురవుతాయి. ఇవేవీ పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో పొందుపరచకపోవడం గమనార్హం.

గ్రామీణ అభివృద్ధికి తోడ్పాటు

ఈ సిమెంట్ పరిశ్రమ వల్ల గ్రామీణాభివృద్ధి జరుగుతుందని అదానీ యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. పెదగంట్యాడ, పరిసర ప్రాంతాల ప్రజలకు జీవనాధార అవకాశాలు మెరుగుపడతాయని తెలిపింది.

కంచరపాలెంలో దోపిడీ

... 3వ పేజీ తరువాయి

నోటికి, చేతులకు ప్లాస్టిక్ టేపు వేసి బంధించారు. అతని చేతికి ఉన్న డైమండ్ రింగ్‌ను లాక్కొన్నారు. అనంతరం బెడ్‌రూమ్‌లోని టీవీ స్టాండ్‌పై ఉన్న కారు తాళాలను తీసుకుని కిందకు వెళ్లిపోయారు. ఇంటి ముందు పార్కు చేసి ఉన్న కారుతో దుండగులు వుడాయించారు. దీనిపై యల్లయ్యమ్మ సోమవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదుచేసి దర్యాప్తు నిమిత్తం క్రైమ్ పోలీసులకు బదిలీ చేశారు. దుండగులు ముఖానికి మాస్కులు, చేతికి గ్లౌజ్‌లు వేసుకున్నారని, జీన్‌ప్యాంట్లు ధరించి ఉన్నారని, హిందీలో మాట్లాడారని యల్లయ్యమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిని బట్టి బిహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఠా పని అయి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు.

మారికవలస వద్ద కారును వదిలేసిన దుండగులు

ఆనంద్‌కుమార్‌రెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగులు అతని కారుని మారికవలస వద్ద వదిలేసి అక్కడి నుంచి వేరొక వాహనంలో పరారైపోయారు. ఘటనా స్థలంతోపాటు చుట్టుపక్కల సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దుండగులు రాత్రి 12.30 గంటల సమయంలో ఒక కారులో జాతీయ రహదారిపై దిగి అక్కడి నుంచి రోడ్డు దాటి ఆనంద్‌కుమార్‌రెడ్డి ఇంటి వైపు వచ్చినట్టు గుర్తించారు. ఎయిర్‌పోర్టు లేదంటే రైల్వేస్టేషన్ నుంచి ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి యాప్‌ల ద్వారా కారును బుక్ చేసుకుని అక్కడికి వచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు. చోరీకి పాల్పడిన తర్వాత ఆనంద్‌కుమార్‌రెడ్డి కారులో ఎన్ఏడీ, సింహాచలం మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డులో వెళ్లినట్టు గుర్తించారు. పెదగదిలి జంక్షన్ వద్ద కారును ఆపి ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడి తర్వాత హనుమంతవాక మీదుగా మారికవలస వైపు వెళ్లినట్టు గుర్తించారు. అక్కడ కారును రోడ్డుపక్కన ఆపి మరో వాహనంలో శ్రీకాకుళం వైపు వెళ్లిపోయినట్టు పోలీసులు భావిస్తున్నారు. చోరీకి పాల్పడింది అంతర్ రాష్ట్రముఠా అయితే వారికి ఆనంద్‌కుమార్‌రెడ్డి ఇంట్లో లేరని, కింది పోర్షన్‌లో వృద్ధురాలు, ఆమె మనుమడు మాత్రమే ఉంటారని ఎలా తెలుస్తుందని పోలీసులు అనుమానిస్తున్నారు. జాతీయ రహదారిపై కారుదిగిన దుండగులు ఎలాంటి తడబాటు లేకుండా నేరుగా ఆనంద్‌కుమార్‌రెడ్డి ఇంటికే వెళ్లడం బట్టి చూస్తే స్థానికుల సహకారం ఏమైనా ఉందా?...అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు.

నవజాత శిశువులకు రక్ష

... 3వ పేజీ తరువాయి

ఉత్పన్నమవుతున్నాయని, వారికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు నలుగురు వైద్యు లను కేటాయించాలని అధికారులు కోరుతున్నారు.

నాణ్యమైన వైద్య సేవలతో కోలుకునేలా

నవజాత శిశువుల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు ప్రత్యేకంగా ఎస్ఎన్‌యూసీ ఉంది. ఇక్కడ 20 వార్మర్స్‌తో సేవలు అందిస్తున్నాం. చిన్నపిల్లల వైద్య నిపుణులు ఆశించిన స్థాయిలో లేకపో వడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పూర్తిస్థాయి చిన్న పిల్లల వైద్య నిపుణులను కేటాయిస్తే మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. ప్రతిరోజూ కనీసం 10 నుంచి 15 మంది చిన్నారులు నవజాత శిశువుల సంరక్షణ కేంద్రంలో ఉంటున్నారు.పిల్లలు పూర్తిగా కోలుకున్న తరువాత వ్యాక్సినేషన్ చేయించి డిశ్చార్జ్ చేస్తున్నాం.

- డాక్టర్ ఎస్.చంద్రశేఖర్,
చిన్న పిల్లల వైద్య నిపుణులు, ఘోష ఆస్పత్రి

గూడుపురాణి

... 3వ పేజీ తరువాయి

ఖాతాలకు సొమ్ములు జమ కావాలి. ప్రతి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన తరువాతే అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేయాలి. కానీ కాంట్రాక్టర్లతో కొందరు అధికారులు మిలాఖత్ కావడంతో త్రైపాక్షిక ఒప్పందం అమలు జరగడం లేదు. ఇళ్లకు ద్వారాలు ఏర్పాటుచేసి, తలుపులు బిగించలేదు. కిటికీలు లేవు. ఇంటిలోపలకు వెళ్లేందుకు ముందున మెట్లు కట్టలేదు. లోపల ఎలక్ట్రికల్ కన్‌సీలింగ్ చేయలేదు. అయినా కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసేశారు. ప్రధానంగా వేల సంఖ్యలో ఇళ్లు నిర్మించే కాంట్రాక్టర్లు ఎక్కువ ఉల్లంఘనలకు పాల్పడ్డారు. వీరికి ఉన్నత స్థాయిలో పలుకుబడి ఉండడంతో అధికారులు కనీసం ప్రశ్నించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన కాంట్రాక్టర్లు ఇప్పుడు కూడా పెత్తనం చెలాయిస్తున్నారు. మొత్తం బిల్లు డ్రా చేసేసి నిర్మాణ బాధ్యతల నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తలుపులు, కిటికీలు బిగించకపోవడం వల్ల ఒక్కో ఇంటికి కనీసం పది వేలు మిగులుతుంది. అయినా అధికారులు మాట్లాడడం లేదు. కొందరు అధికారులు అందినకాడికి దండుకున్నారు. అయితే ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఇటీవల జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సమీక్షించినపుడు, తలుపులు, కిటికీలు, కన్‌సీలింగ్‌పై ప్రశ్నించడంతో అధికారులు కంగారుపడ్డారు. ప్రతి ఇంటికి తలుపు బిగించాల్సిందేనని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లను ఒప్పించి తలుపులు, కిటికీలు బిగించేలా అధికారులు ఏమి చేస్తారో చూడాలి.





వైభవంగా నారసింహ మాస జయంతి

సింహాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రినాథుడి మాస జయంతి సోమవారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామి, ఉభయ దేవేరులను అలంకరించి పల్లకిలో ఉంచారు. షోడశోపచారాలు సమర్పించిన తరువాత ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేద మంత్రోచ్ఛారణల నడుమ బేడామండపంలో తిరువీధి ఉత్సవం జరిపారు. మార్గం పొడవునా అష్టదిక్పాలకులకు పూజలు చేసి నీరజనాలర్పించారు.











నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి పెందుర్తి మండలం లక్ష్మీపురానికి చెందిన కసిరెడ్డి అప్పలస్వామి దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్ రూపంలో దేవస్థానం ప్రజా సంబంధాల అధికారి లక్ష్మీప్రసన్నకు సోమవారం వారు అందజేశారు.



పీజీఆర్‌ఎస్‌కు 13 వినతులు

గాజువాక, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 13 వినతులు అందాయి. జోనల్ పరిధిలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, వీధి దీపాలు వేయాలని, కుక్కల బెడద నివారించాలని కోరుతూ ప్రజా సంఘాల ప్రతినిధులు వినతి పత్రాలందజేశారు. రహదారులపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా పరిణమిస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగించాలని కోరారు. జోనల్ కమిషనర్ శేషాద్రి వినతులు స్వీకరించారు. సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రికి స్వచ్ఛ అవార్డు

అగనంపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి స్వచ్ఛ ఆస్పత్రుల విభాగంలో జిల్లా స్థాయిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర 2025 అవార్డు దక్కింది. ఈ మేరకు సోమవారం నగరంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ అవార్డును అందుకున్నారు. పచ్చదనం, తడి, పొడి చెత్త సేకరణ, స్వచ్ఛ మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత అంశాల్లో సిబ్బంది, రోగులు, వారి సహాయకులను చైతన్యం చేయడం, నిరంతర కృషి వల్ల ఆస్పత్రికి ఈగౌరవం దక్కిందని సూపరింటెండెంట్ తెలిపారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి రాష్ట్రస్థాయిలో అవార్డు సాధించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

తిరుమలనగర్ కాలనీకి...

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వవార్డు తిరుమల నగర్ కాలనీకి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు లభించింది. సోమవారం నగరంలోని జరిగిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డు-2025 కార్యక్రమంలో భాగంగా ఏడాది పాటు నిర్వహించిన స్వచ్ఛ కార్యక్రమాలకు విశాఖ పార్లమెంట్ సభ్యుడు మతుకుమిల్లి శ్రీభరత్, డిప్యూటీమేయర్ దల్లి గోవింద రాజు ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా తిరుమలనగర్ కాలనీ ప్రతినిధులు వసంత రెడ్డి, సత్యనారాయణ, రాము, రాజు, జీవానందంలు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపునకు వందలాది ఇంకుడు గుంతలు తవ్వించినందుకు, ప్లాస్టిక్ నివారణకు ర్యాలీలు, అవగాహన సదస్సులు, కాలుష్య నివారణకు మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్, శ్రమదానాలను చేయించడంలో కాలనీ ప్రతినిధుల కృషికి అవార్డు లభించిందని హర్షం వ్యక్తం చేశారు.




కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అగనంపూడి ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపీకృష్ణ, తిరుమలనగర్ కాలనీ ప్రతినిధులు వసంత రెడ్డి, సత్యనారాయణ, రాము, రాజు, జీవానందం

ఇరుకు వంతెనతో రాకపోకలకు పాట్లు

అగనంపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి దిబ్బపాలెం వద్ద రైల్వే ట్రాక్ కింద వంతెన విస్తరణకు నోచుకోకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వంతెన కేవలం 4 అడుగుల వెడల్పు మాత్రమే ఉంది. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనాలు మాత్రమే ప్రయాణించడానికి వీలవుతోంది. అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీల నివాసితులతోపాటు నిత్యం ఈమార్గంలో మంగళపాలెం, దువ్వాడ, వెదుళ్లనరవ, అజనగిరి, నంగినారపాడు, సంధ్యానగర్ రాకపోకలకు సాగిస్తుంటారు. అలాగే ఆయా గ్రామాల నుంచి అగనంపూడికి వెళ్తుంటారు. రాకపోకలకు ఇబ్బందులు ఉండడంతో దువ్వాడ మీదుగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంటోందని స్థానికులు వాపోతున్నారు. వంతెన విస్తరణ కోసం జీవీఎంసీ, రైల్వే ఉన్నతాధికారులను కలిసి విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా స్పందించి వంతెన విస్తరించాలని కోరుతున్నారు.



దిబ్బపాలెం వద్ద రైల్వేట్రాక్ కింద వంతెన

ఇబ్బందులు పడుతున్నాం



వంతెన ఇరుకుగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. మంగళపాలెం, వెదుళ్లనరవ, దువ్వాడ నంగినారపాడు, జెన్‌ఎన్‌యూఆర్‌ం కాలనీ, హౌసింగ్ వాసులు నిత్యం అగనంపూడి రావాల్సి ఉంది. అగనంపూడి నిర్వాసిత కాలనీల నుంచి వస్తుంటారు. వంతెనలోనుంచి ఆటోలు వచ్చే పరిస్థితి లేదు. దీంతో తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఎన్నో వ్యయ ప్రయాసలు భరించాల్సి వస్తోంది. అధికారులు చొరవ తీసుకుని బ్రిడ్జిని విస్తరించాలి.

-కూర్మపు రవి, దానబోయినపాలెం

స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపోను తరలించొద్దు: ఎన్‌ఎంయూ

కూర్మన్నపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపో తరలింపు ప్ర క్రియను తక్షణ మే నిలుపు చేయాలని కోరుతూ ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 39వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూ స్టీల్‌సిటీ డిపో అధ్యక్షుడు జి.రామకృష్ణ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యంతో 33 ఏళ్ల స్టీలు సిటీ డిపో లీజు ముగుస్తున్న నేపథ్యంలో ఇటీవల ఆర్టీసీ యాజమాన్యానికి ఉక్కు యాజమాన్యం నోటీసులు జారీ చేసిందన్నారు. ప్రస్తుత భూమి విలువ ఆధారంగా లీజు చెల్లించాలని, వడ్డీలేని సెక్యూరిటీ డిపాజిట్, సేవా ఛార్జీల రూపేణా కోట్లాది రూపాయలు చెల్లించాలని కోరడం తగదన్నారు. గతంలో నిర్దేశించిన లీజును పొడిగించి సహకరించాలని కోరారు. ఈ దీక్షలలో డీఏ రావు, పీఆర్ రావు, వైఏ రాజు, ఎం.రమేశ్ కూర్చొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

నేటి నుంచి పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు

ఆటోనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70 వార్డు శ్రీనివాసనగర్, ఎర్రగడ్డ కాలనీ, శ్రామిక నగర్ గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు బండారు సత్యారావు, బొడ్డేడ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని మామిడి తోరణాలు, అరటి చెట్లు, విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సోమవారం అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మోహన్ కృష్ణ, ఆడారి రామ కృష్ణ, కోటేశ్వరరావు, కర్రి రమణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు

గోపాలపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లపువానిపాలెంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో రెవెన్యూ సిబ్బంది చర్యలు చేపట్టారు. సర్వే నంబరు 124/3డీ2, 122/1లో ఆర్‌ఐ కె.కోమలి ఆధ్వర్యంలో సోమవారం సర్వే చేపట్టారు. 124/3డీ2లో 376 చదరపు గజాల యూఎల్‌సీ భూమి, సర్వే నంబరు 122/1లో 394లో చదరపు గజాల భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

అగనంపూడి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీ ఎంసీ 85వ వార్డు పెదమడక లోని ఉమామమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు రుద్రాభిషేకాలు చేశారు.

ఆలయానికి విరాళం

జీవీఎంసీ 79వ వార్డు శాంతినగర్ శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్వహణ కోసం సమాచార హక్కు చట్టం ఉద్యమ కర్త పట్టా రామఅప్పారావు రూ.25 వేలు విరాళాన్ని సోమవారం అందజేశారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అతనిని సత్కరించారు. ఈకే చారి, ఉమామహేశ్వరరావు, సాయిబ్ నాయుడు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష



సమీక్షిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

సిరిపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్-2041పై సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ గత పాలకుల హయాంలో మాస్టర్ ప్లాన్‌లో జరిగిన తప్పిదాలపై ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం కావాలన్నారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేశ్, కార్యదర్శి మురళి, ముఖ్య ప్రణాళిక అధికారి శిల్ప తదితరులు పాల్గొన్నారు.

8న జూనియర్ కళాశాలల్లో జీఎస్టీపై అవగాహన

మద్దిలపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో ఈనెల 8న అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. కలెక్టర్ ఆదేశాలతో అవగాహన సదస్సులు నిర్వహించడానికి ఆర్‌ఐవో మురళీధర్ సమాయత్తమయ్యారు. జిల్లాలోని 188 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో సుమారు 90వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. 26 కళాశాలల్లో ప్రవేశాలు నిలిపివేశారు. కేంద్రం విద్యార్థులకు అవసరమైన ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గించింది. 12 శాతం జీఎస్టీ ఉన్న వ్యాయామం, గ్రాఫ్,ల్యాబ్ నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, పేపర్లు, మ్యాప్‌లు, అట్లాస్, గ్లోబ్‌లు, పెన్సిళ్లు, క్రేయాన్లు, బొగ్గు, పెన్సిల్ షార్ప్‌నర్లు, 5 శాతం ఉన్న ఎరేజర్లకు జీరో జీఎస్టీ అమలుచేసింది. ఈ మేరకుఅవగాహన కల్పించనున్నారు. అలాగే 12శాతం జీఎస్టీ ఉన్న జామెట్రీ, రంగు పెట్టెలు, పేపర్ కార్టూన్లు, పెట్టెలు, పేపర్ అచ్చువేసిన ట్రేలకు ఐదు శాతం జీఎస్టీ అమలవుతోంది. అవగాహన సదస్సులపై ఇప్పటికే కళాశాలలకు ఆర్‌ఐవో సమాచారం ఇచ్చారు. ఈమేరకు జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ సోమవారం ఆర్‌ఐవో కార్యాలయంలో కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 8న జీఎస్టీ 2.0పై విద్యార్థులకు పక్కాగా అవగాహన కల్పించాలని సూచించారు.

'ఏపీపీఎస్సీ సభ్యుడు సుధీర్‌పై చర్యలు తీసుకోండి'

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు పగిరి సుధీర్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏపీపీఎస్సీలో లీకువీరుడు పేరిట 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం ఆధారంగా విచారణ జరపాలని సోమవారం కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగ బద్ధ సంస్థ అయిన ఏపీపీఎస్సీలో జగన్మోహన్‌రెడ్డి హయాంలో సభ్యుడిగా నియమితులైన సుధీర్, నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపులు నిర్వహించి ఉద్యోగం వస్తోందా? రాదా అనే సందేహాలు కలిగించారని ఆరోపించారు. సంస్థకు చైర్మన్ ఉండగా ఒక సభ్యుడు అంతా తానై వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. గవర్నర్, సీఎం, విద్యాశాఖా మంత్రి జోక్యం చేసుకుని సుధీర్ అక్రమాలపై విచారణ జరపాలని కోరారు.

స్వచ్ఛాంధ్రకు ప్రజలు సహకరించాలి

- విశాఖ విశిష్టత పెంచేందుకు కఠిన నిర్ణయాలు
- నగరంలో ఆపరేషన్ లంగ్స్‌తో మార్పునకు నాంది
- ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్
- రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలి: కలెక్టర్
- వేడుకగా స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవం



స్వచ్ఛ అవార్డు అందజేస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎంపీ శ్రీభరత్, చిత్రంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, తదితరులు

సిరిపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర సాధనకు నగర వాసులంతా సహకరించాలని ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ కోరారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో సోమవారం సాయంత్రం స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవం అత్యంత వేడుకగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ ఇప్పటికే అంతర్జాతీయ ఖ్యాతి గడించిన విశాఖ నగరాన్ని మరింత అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రజా సహకారం అవసరమన్నారు. పరిశుభ్రత విషయంలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల చేపట్టిన ఆపరేషన్ లంగ్స్ సానుకూల మార్పునకు నాందిగా అభివర్ణించారు. దీనిపై నగరంలో చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో 80శాతం మంది సానుకూలత వ్యక్తం చేశారన్నారు. ఇది నిరంతరం కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ఫుట్‌పాత్‌లు ప్రజలు నడవడానికి మాత్రమేనని, వ్యాపారాలకు అడ్డా కాకూడదన్నారు. ఈ విషయాన్ని నగర వాసులు గుర్తించాలన్నారు. స్వచ్ఛ విశాఖగా తీర్చిదిద్దేందుకు భవిష్యత్తులో మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకోకతప్పదన్నారు. సింగపూర్ తరహాలో నగరంలోనూ రహదారులు అద్భుతంగా మార్చేలా బృహత్తర ప్రాజెక్టులు చేపట్టబోతున్నామన్నారు. సుందర విశాఖ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. స్వచ్ఛాంధ్ర పోటీల్లో నగరానికి ఇన్ని అవార్డులు రావడం గర్వకారణమని ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. స్వర్ణాంధ్ర కంటే ముందు స్వచ్ఛాంధ్ర కావాలని, ఇందుకు ప్రజలు సంపూర్ణంగా సహకరించాలని, అధికారులు ఉత్సాహంగా పనిచేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు నాగలక్ష్మి, రాము, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద తదితరులు మాట్లాడారు.

జిల్లాకు అవార్డుల పంట

జిల్లాకు ఏడు రాష్ట్ర స్థాయి అవార్డులతో పాటు 15 కేటగిరీల్లో 45 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయి. స్వచ్ఛ మునిసిపాలిటీ కేటగిరీలో గ్రేటర్ విశాఖకు స్వచ సర్వేక్షణ్ అవార్డు, గ్రామ సంస్థల విభాగంలో పెందుర్తి మండలం గొరపల్లి, ఎస్‌ఎల్‌ఎఫ్ కేటగిరీలో సింహపురి మహిళా సమాఖ్య, జడ్పీహెచ్‌ఎస్ నడుపూరు, ఎంవీపీ రైతు బజార్, స్వచ్ఛ ఇండస్ట్రీస్‌లో లోటస్ వైర్‌లెస్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, స్వచ్ఛ కాలనీల్లో తిరుమల నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉన్నాయి. కాగా జిల్లాకు వివిధ కేటగిరీల్లో 45 అవార్డులు రాగా, వాటిని అతిథుల చేతులమీదుగా ప్రతినిధులకు అందజేశారు.

జడ్పీ కార్యాలయానికి స్వచ్ఛ అవార్డు



జడ్పీ సీఈవో నారాయణమూర్తికి అవార్డు ఇచ్చి సత్కరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానంలో భాగంగా జిల్లా పరిషత్ కార్యాలయానికి పరిశుభ్ర కార్యాలయం కేటగిరీలో అవార్డు వచ్చింది. అవార్డును జడ్పీ సీఈవో పి. నారాయణమూర్తికి కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ అందజేశారు. పారిశుధ్య కార్మికులు, చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, పాలనాధికారులు, ఇతర సిబ్బందికి అంకితం చేస్తున్నట్టు సీఈవో ప్రకటించారు.

విద్యార్థినులకు మెరుగైన వైద్యమందిస్తున్నాం

- హోం మంత్రి వంగలపూడి అనిత



విద్యార్థినుల ఆరోగ్యంపై వైద్యులను ప్రశ్నిస్తున్న హోం మంత్రి అనిత

మహారాణిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పచ్చకామెర్ల వ్యాధితో అనారోగ్యానికి గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం ఏకలవ్య గురుకుల గిరిజన పాఠశాల విద్యార్థినులను సోమవారం ఆమె పరామర్శించారు. బాలికల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుగుతుందని, వైద్య నిపుణులతో ప్రత్యేక కమిటీని నియమించామన్నారు. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మంత్రులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, అధికారులు అప్రమత్తంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జగన్ హయాంలో కల్తీ మద్యంతో ఎంతోమంది ప్రాణాలు తీశారని విమర్శించారు. ప్రజారోగ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వీడాలి

- ఇకపై జోనల్ కార్యాలయాల్లో పరిశీలన
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- పీజీఆర్‌కు 248 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం/మహారాణిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందే సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. పరిష్కారంలో తీవ్ర అలసత్వం కనిపిస్తోందని, దీనివల్ల పదేపదే వినతులు అందుతున్నాయన్నారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌తో సహా జిల్లా అధికారులు 248 అర్జీలను స్వీకరించారు. ఇందులో రెవెన్యూ 86, జీవీఎంసీ 66, పోలీసు 16, ఇతర విభాగాలకు 80 ఫిర్యాదులు అందాయి. అనంతరం గతంలో అందిన అర్జీలకు సంబంధించి తీసుకున్న చర్యలపై అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని ఎండార్స్‌మెంట్ సక్రమంగా ఇవ్వకపోవడమే దీనికి కారణమన్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోందన్నారు. ఇకపై జోనల్ కార్యాలయాలకు వచ్చి పరిశీలిస్తానన్నారు. కొంతమంది ఆన్‌లైన్‌లో అందే అర్జీలను కనీసం చూడడం లేదన్నారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాల నుంచి వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరం పరిష్కారించాలని ఆదేశించారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన వారిపై అసహనం వ్యక్తం చేశారు. ఆలస్యమైన వారు, హాజరు కాని వారికి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్ తదతరులు పాల్గొన్నారు.

మిగిలిన వారికి పట్టాలివ్వండి

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికలో 248 వినతులు అందాయి. కలెక్టర్, జేసీ, ఇతర అధికారులకు అందజేసిన వినతుల్లో కొన్ని.. నగరంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నిరుపేద లబ్ధిదారులందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని గాజువాకకు చెందిన సీతారామ్ వినతిపత్రం అందజేశారు. 2016లో జీవో నంబరు 296 ప్రకారం గాజువాకలో 4,298 మందిని ఆక్రమణదారులుగా గుర్తించారన్నారన్నారు. వీరిలో 2,668మందికి పట్టాలు వచ్చాయని గాజువాక తహశీల్దారు తెలిపారని, మిగిలిన వారికి పట్టాలివ్వాలన్నారు.

ప్రభుత్వ భూమిని అమ్మేశారు

ఆనందపురం మండలం రామవరం సర్వేనంబరు 169/2లో ప్రభుత్వ భూమిని కొంతమంది అమ్మేశారని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. సర్వేనంబరు 164/3లో 1.53 ఎకరాల డీపట్టాను ఇతరులకు రిజిస్టర్ చేయడంతో పట్టాను రద్దుచేశారని, ఈ సర్వేనంబరుకు ఆనుకుని 0.87 ఎకరాలను కూడా అప్పట్లో రద్దుచేసినా ఆదేశాలను దాచిపెట్టారన్నారు. ఈ తరువాత అదే భూమిని అమ్మేశారని, అధికారులు చర్యలు తీసుకుని, భూమిని స్వాధీనంచేసుకోవాలని కోరారు.

జీవీఎంసీలో 81 వినతులు

వెంకోజీపాలెం: జీవీఎంసీ పీజీఆర్‌ఎస్‌కు 81 వినతులు వచ్చాయని అదనపు కమిషనర్ డీవీ రమణ మూర్తి తెలిపారు. మరో అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మతో కలిసి సోమవారం వినతులు స్వీకరించారు. అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేట్టాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను, జోనల్ కమిషనర్లను ఆదేశించారు.

పోలీసు కమిషనరేట్‌కు 80 ఫిర్యాదులు

మహారాణిపేట: పోలీసు కమీషనరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో 80 ఫిర్యాదులు అందాయి. సీపీ శంఖబ్రత బాగ్చి స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని, చర్యలు తీసుకోవాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులను ఆదేశించారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



విద్యార్థిని పరామర్శిస్తున్న రామకృష్ణ, తదితరులు

మహారాణిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాల బాలికలు పచ్చకామెర్లు బారిన పడి, ఇద్దరు మృతి చెందడం విచారకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికలను సోమవారం ఆయన పరామర్శించారు. అందుతున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మృతిచెందిన బాలికల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున, చికిత్స పొందుతున్న బాలికలకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ఘటనపై న్యాయవిచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో వసతులు లేక పిల్లలు అనారోగ్యానికి గురయ్యారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యా వ్యవస్థను గాలికి వదిలేశారని, మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించారన్నారు. ఆయన వెంట నేతలు ఎ.విమల, ఎం.పైడిరాజు తదితరులున్నారు.

కెనరా బ్యాంకు అధికారుల యూనిటీ మార్చ్



యూనిటీ మార్చ్‌లో పాల్గొన్న కెనరా బ్యాంకు అధికారులు

సిరిపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐక్యతే మా బలం అనే నినాదంతో కెనరా బ్యాంకు అధికారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సాగరతీరంలో యూనిటీ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమానికి జనరల్ సెక్రటరీ కె.రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ పట్నం వేదికగా నవంబరు 8,9,10 తేదీల్లో బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ త్రైవార్షిక సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు. దేశం మొత్తం ఒకే మనసు-ఒకే స్వరంతో దీనిని ఘనంగా నిర్వహించాలనే సందేశాన్ని అందించేందుకే ఈ యూనిటీ మార్చ్ నిర్వహించామన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న కెనరా బ్యాంకు అధికారుల ఐక్యతను, సంఘీ భావాన్ని ఇది ప్రతిబింబిస్తుందన్నారు. అనంతరం గాదిరాజు ప్యాలెస్‌లో సభ్యులు మీట్ నిర్వహించి సమావేశ ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రమా ప్రసాద్, జాయింట్ సెక్రటరీ జీవన్ సత్యప్రకాష్, డీజీఎస్ రామ రత్నకుమార్, ఏజీఎస్ రాకేష్, సెక్రటరీ ఉమామహేష్ తో పాటు రీజినల్ పరిధిలోని మూడు వందల మందికి పైగా బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

ప్రాణం తీసిన అతివేగం

- చెట్టును ఢీకొట్టిన ద్విచక్రవాహనం
- యువకుడి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



హరీశ్ (ఫైల్ ఫొటో)

మద్దిలపాలెం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బైక్ కొనివ్వకపోతే చచ్చిపోతానని తల్లిదండ్రులను బెదిరించాడు. భయంతో అప్పు చేసి దసరా రోజున స్పోర్ట్స్ బైక్ కొనుగోలు చేసిచ్చిన తల్లిదండ్రులు తమ కుమారుడి కోరిక తీర్చామని మురిసిపోయారు. కానీ కొత్త బైకే కొడుకు నిండు ప్రాణాలను హరిస్తుందని ఊహించలేదు. మితిమీరిన వేగంతో చెట్టును ఢీకొట్టడంతో తిరిగిరాని లోకాలకు తరలిపోయిన కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి... మహరాణిపేటకు చెందిన శీరందాసు శ్రీను ఆటోడ్రైవర్. అతని భార్య ఇళ్లల్లో పనిచేస్తుంది. కుమారుడు హరీష్ (19) కాశ్యప్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కుమార్తె అనారోగ్యంతో బాధపడుతోంది. కాగా గత ఆరు నెలలుగా తనకు బైక్ కొనివ్వాలని హరీష్ తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నాడు. ఈ దశలో కొద్దిరోజుల కిందట బైక్ కొనకపోతే చచ్చిపోతానని బెదిరించాడు. దీంతో శ్రీను రూ.2.8 లక్షల ఖరీదైన యమహా బైక్‌ను కొనుగోలుచేశాడు. తన వద్ద డబ్బు లేకపోవడంతో రూ.50వేలు అప్పుచేసి డౌన్‌పేమెంట్ చెల్లించారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణం తీసుకున్నారు. దసరారోజున కొత్త బైక్ కొనుగోలుచేసి హరీష్‌కు ఇచ్చారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి 12.15 గంటలకు మద్దిలపాలెం నుంచి హరీష్ తన స్నేహితుడు వినయ్‌తో కలిసి టిఫెన్ చేయడానికి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లాడు. తిరిగి 1.15 గంటలకు సిరిపురం రోడ్డులో మద్దిలపాలెం వైపు వస్తుండగా టైకూన్ జంక్షన్‌కు చేరుకునేసరికి హరీష్ మితిమీరిన వేగంతో ఓ చెట్టును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హరీష్, వినయ్ ఎగిరి రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో ప్రయాణిస్తున్న వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుల్ని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హరీష్ మృతిచెందగా, వినయ్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా సెక్యూరిటీ గార్డు మృతి

కొమ్మాది, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో సెక్యూరిటీ గార్డు మృతిచెందాడు. ఈ సంఘటన పీఎంపాలెం రామాలయం సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా బాలగుడబకు చెందిన ముమ్వల శివప్రసాద్ (54) స్థానికంగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. భార్య పద్మజతో కలసి రామాలయం సమీపంలో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్వగ్రామం వెళ్లేందుకు బయలుదేరాడు. కాగా సోమవారం ఉదయం 6.30 గంటల సమయంలో రామాలయం సమీపంలోని కల్వర్టు కింద శివప్రసాద్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి భార్యకు సమాచారం ఇచ్చారు. కాగా తన భర్త మృతిపై అనుమానాలున్నాయని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురిని కాపాడిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో స్నానాలకు దిగి, కెరటాల ఉధృతిలో కొట్టుకుపోతున్న ఆరుగురిని లైఫ్‌గార్డ్స్ రక్షించి, తీరానికి చేర్చారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మనిగోస్వామి(21), లోకేష్ ఆరత్ (22), ప్రియాంక (20), బోసు ప్రధాన్ (29), ఆంచల్ రాణా (22) సోమవారం రుషికొండ బీచ్‌కు వచ్చారు. సముద్రం అల్లకల్లోలంగా మారిన విషయం తెలియక స్నానాలకు ఉపక్రమించారు. నీటిలో ఆటలాడుతుండగా పెద్ద అల వారిని తాకింది. దీంతో సముద్రంలోకి కొట్టుకు పోయారు. సమీపంలోని లైఫ్‌గార్డులు స్పందించి వారిని కాపాడారు. అక్కడికి కొద్ది దూరంలో స్నానం చేస్తున్న ఒడిశాకు చెందిన గణేష్ గిరి (29) కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డులు రక్షించారు. ఆరుగురికీ మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపేశారు.

అప్పన్న ఆలయ సిబ్బంది దురుసు ప్రవర్తనపై ఫిర్యాదు

సింహాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అప్పన్న స్వామి దర్శనానికి వచ్చిన తమపై సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని ఏయూ ఉద్యోగి పి.మంగరాజు పీఆర్‌ఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. శనివారం మధ్యాహ్నం పవళింపు సేవ సమయానికి కాస్త ముందుగా అతిశ్రీఘ్రదర్శనం టికెట్లు తీసుకుని దర్శనానికి వెళ్లారు. ఆలయ ప్రధాన ద్వారం నీలాద్రి గుమ్మం వద్ద ఉన్న నాల్గవ తరగతి ఉద్యోగివాగ్వావాదానికి దిగి మహిళలను చేత్తే నెట్టివేసి అవమానించారు. పర్యవేక్షణాధికారి దర్శనానికి పంపారని ఫిర్యాది చెప్పారు. భక్తుల పట్ల అమర్యాదగా ప్రవర్తించిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నడుపూరు ఉన్నత పాఠశాల, తిరుమల నగర్ కాలనీకి స్వచ్ఛ అవార్డులు



అవార్డు అందుకుంటున్న తిరుమలనగర్ కాలనీ ప్రతినిధులు

కూర్మన్నపాలెంలోని తిరుమల నగర్ కాలనీ, నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు స్వచ్ఛ అవార్డులు లభించాయి. ఈ మేరకు సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా తిరుమలనగర్‌కాలనీ ప్రతినిధి, నడుపూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అవార్డులు అందుకున్నారు



అవార్డు అందుకుంటున్న నడుపూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు